హైదరాబాద్ వార్త



# అక్రమ నిర్మాణాలపై "హైడ్రా "పంజా

-ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లలో నిర్మాణాలు కూల్చివేత

-చెరువుల సమీపంలో కొనేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచన

-అక్రమ నిర్మాణాలపై సమాచారం ఇవ్వాలని నగరవాసులకు పిలుపు





**హైదరాబాద్, ఆగస్టు 10,ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి పరిధిలో అక్రమనిర్మాణాలపై హైడ్రా యంత్రాంగం కొరగా ఝులిపిస్తుంది. చెరువులు, రోడ్లు, వీధులల్లో ఆక్రమించి నిర్మించిన ఇళ్లు, ఇతర నిర్మాణాలను తొలగిస్తున్నారు. ఈమేరకు శనివారం శివారంపల్లి,చందానగర్,హఫీజ్‌పేట్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలను చేపట్టారు. చందానగర్ సర్కిల్ హఫీజ్‌పేట్ డివిజన్ వైశాలినగర్ లోని ఈర్లచెరువు బఫర్‌జోన్‌లో నిర్మించిన మూడు అక్రమ నిర్మాణాలు కూల్చివేశారు. రాజేంద్రనగర్ నియోజకర్గంలోని శివరాంపల్లిలో 18 ఎకరాల చెరువులో కబ్జాకు గురైన 5ఎకరాలల్లో నిర్మించిన అక్ర కట్టడాలను కూల్చుతుండగా బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్‌ముబీన్ అడ్డుకునే ప్రయత్నం చేయగా అతన్ని అదుపులోకి తీసుకుని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని కేశంపేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కూల్చేసిన అక్రమనిర్మాణాల్లో ఎమ్మెల్యే ముబిన్‌కు సంబంధించిన భవనాలు కూడా ఉన్నట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. ఈఅక్రమ నిర్మాణాల కూల్చివేతలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ దగ్గరుండి పర్యవేక్షించారు. ట్రైసిటీ పరిధిలో చెరువులకు సంబంధించిన బఫర్‌జోన్లు, ఎఫ్‌టిఎల్ పరిధిలో అక్రమనిర్మాణాలు చేపట్టవద్దని చేపడితే నిర్మాణదశలో ఉన్నా చట్టపరంగా కూల్చివేయబడుతుందని రంగనాథ్ తెలిపారు. అలాగే ఇలాంటి నిర్మాణాలు చేపట్టేందుకుగానూ ఎవరైనా ప్రభుత్వ అధికారులు ,వ్యక్తులుగాని బిల్డర్లకు ,రియల్టర్లకు సహకరించినట్లయితే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**చెరువు పరిసరాల్లో కొనేటప్పుడు జాగ్రత్త..**

చెరువుల పరిసరాల్లో ఇంటి స్థలాలు, అపార్ట్‌మెంట్‌లు,వ్యక్తిగత ఇండ్ల సంబంధించిన స్థిరాలస్థులను కొనుగోలు చేసేముందు ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా చెరువు పరిసర ప్రాంతాల్లో తక్కువ ధరకు ఇంటి స్థలాలు , అపార్ట్‌మెంట్‌లు లభిస్తున్నాయని వాటిని కొనుగోలు చేస్తే ప్రజలే నష్టపోతారన్నారు. కావున చెరువుల పరిసరాల్లో స్థిరాస్థులు కొనుగోలు చేసేముందు ప్రజలు ముందుగా తాము కొనుగోలు చేస్తున్న స్థిరాస్తులు కానీ, నిర్మాణం చేపడుతున్న ఇండ్లు చెరువుకు ముప్పై మీటర్ల బఫర్‌జోన్ పరిధిలో ఉందా లేదా అనేది తెలుసుకోవాలన్నారు. ఈవిషయంపై ప్రజలకు ఎలాంటి అనుమానాలు సందేహాలు ఉన్నావెంటనే హైడ్రా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ సమాచారానికి సంబంధించి ప్రజలకు అర్థమయ్యే భాషలో వారిని అప్రమత్తం చేసే రీతిలో త్వరలో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

**అక్రమనిర్మాణాలపై సమాచారం ఇవ్వండి..**

చెరువులకు సంబంధించిన బఫర్ జోన్ల పరిధిలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టినా ,ప్రస్తుతం చేపడుతున్న వాటికి సంబంధించని కనబడితే స్థానిక ప్రజలతోపాటు , స్వచ్ఛంద సంస్థలు హైడ్రా అధికారులకు సమాచారం అందించాలని వాటిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు.

# ఔటర్‌రింగ్‌రోడ్ సరిహద్దుగా జిహెచ్‌ఎంసి

## -విలీన ప్రక్రియ వేగవంతం చేస్తున్న అధికారులు



**హైదరాబాద్,ఆగస్టు 10,ప్రభాతవార్త:** హైదరాబాద్ మహానగరం విశ్వనగరంగా రూపుదిద్దుకుంటుంది. ఔటర్‌రింగ్‌రోడ్ వరకు ఉన్న ప్రాంతాలన్ని కలిపి జిహెచ్ఎంసి పరిధిలోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చకచకా సాగిపోతున్నాయి. ఇప్పటికే దీనికొసం కసరత్తులు పూర్తయ్యాయి. నగర శివార్లలోని 7మున్సిపల్ కార్పొరేషన్లు ,20 మున్సిపాలిటీలు , 33 గ్రామపంచాయితీల వీలీనానికి ఏర్పాట్లు చురుగ్గా ఏర్పాట్లు సాగిపోతున్నారు. దీంతో 2,053 చదరపు కిలోమీటర్ల పరిధికి జిహెచ్ఎంసి విస్తరించనుంది. రాష్ట్రంలో మున్సిపాలిటీలకు వచ్చేఏడాది జనవరి 26వరకు .. జిహెచ్ఎంసికి ఫిబ్రవరి 10 2026 వరకు సమయం ఉంది. అయితే జిహెచ్ఎంసి బాడీకాలపరిమితి ముగిసిన తర్వాత వీటిని విలీనం చేయాలా ..లేక ముందే చేయాలా అన్న విషయంలో ప్రభుత్వం తర్జన భర్జన పడుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పరిధిలోకి 33గ్రామాలను తీసుకురావడానికి పంచాయితీరాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతిపాదనలు రెడీ చేశాయి. మొత్తం 2,053చదరపు కీలోమీటర్ల పరిధిలో హైడ్రా ఉంది. దీనిలో విలీనం చేయబోయే గ్రామపంచాయితీలు 33ఉన్నాయి. వీటి విస్త్రీర్ణం 386. 28 చరదపు కిలోమీటర్లు ఉంది. 2007లో 12 మున్సిపాలిటీలు, 8గ్రామపంచాయితీలను కలిపి జిహెచ్ఎంసి ఏర్పాటు చేశారు. దాదాపుకోటి జనాభా ఉండగా 150డివిజన్లు నెలకొల్పారు. జిహెచ్ఎంసికి వచ్చే ఆదాయంతో డివిజన్లలో చాలావరకు అభివృద్ధి పనులు చేపట్టారు. ఇదే సమయంలో ప్రస్తుతం రాజధాని చుట్టపక్కల ఉన్న ఏడు నగరపాలక సంస్థలు, 21పురపాలక సంఘాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఈనేపథ్యంలో సిఎం రేవంత్‌రెడ్డి గ్రేటర్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ప్రస్తుతం జిహెచ్ఎంసి పరిధిలో 150 డివిజన్లు ఉండగా ..దాదాపు 75లక్షలమంది ఓటర్లు ఉన్నారు. జనాభా కోటివరకు ఉంది. నగర పాలిక సంస్థలు, పురపాలక సంఘాలను బల్దియాలో విలీనం చేస్తే మరో 60లక్షల వరకు జనాభా పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు.

**20మున్సిపాలిటిలు, 8కార్పొరేషన్లు..**

**33గ్రామపంచాయతీలు**

జిహెచ్ఎంసి పరిధికి వెలుపల మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో 20మున్సిపాలిటీలు ,8మున్సిపల్ కార్పొరేషన్లు, 33గ్రామపంచాయితీలు ఉన్నాయి. మేడ్చల్ జిల్లా పరిధిలో బోడుప్పల్, జవహర్‌నగర్, నిజాంపేట్, పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్లుగా ఉంటే దమ్మాయిగూడ ,దుండిగల్ , ఘట్కేసర్, గుండ్లపోచంపల్లి , కొంపెల్లి,మేడ్చల్,నాగారం, పోచారం, తూం కుంట మున్సిపాలిటీలుగా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లుగా ఉంటే ఆదిబట్ల ,జల్ పల్లి, మణికొండ, నార్సింగి, పెద్దఅంబర్‌పేట్ , శంషాబాద్ ,తుక్కుగూడ, తుర్కయంజాల్ మున్సిపా లిటీలు ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలో కార్పొరేషన్లు లేకపోయినా అమీన్‌పుర్, తెల్లాపూర్ ,ఐడిఏ బొల్లారం మున్సిపాలిటీలుగా ఉన్నాయి. ఇప్పుడు కొత్తవ్యవస్థ ఏర్పాటుతో ఇవన్నీ అందులో భాగం కానున్నాయి.

# దేశభక్తి గీతాలతో మార్మోగిన జయహో భారత్



సత్కారం పొందిన కళాకారులతో అతిథులు దామోదర్‌గుప్తా, దైవజ్ఞశర్మ, లలితారావు, గీతాసింగ్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, ఆగస్టు 10 ప్రభాతవార్త :** భారతీయ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆనాటి స్వాతంత్ర్య పోరాటం, సంస్కృతి, సంప్రదాయాలు ముందుతరాలకు తెలియజేయడమేకాక అందించడం జరుగుతుందని ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. జయహోభారత్‌లో పాల్గొన్న గురువులు, కళాకారులు, తల్లిదండ్రులను అభినందిస్తూ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో భారతదేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు లయన్ లలితరావు నిర్వహణలో శనివారం సాయంత్రం చిన్నారి, యువ గాయనీగాయకులు, నృత్యకళాకారులు తెలుగు హిందీ భాషల్లో వీనులవిందుగా ఆలపించిన దేశభక్తి ఆధ్యాత్మిక గీతాలు, ఆయా గీతాలకు నృత్యప్రదర్శనలతో భారతదేశ ఔన్నత్యాన్ని, చరిత్ర, కళలు, పండుగల గొప్పదనాన్ని చాటుతూ రవీంద్రభారతి ప్రధాన మందిరం జయహో భారత్ అంటూ మార్మోగిపోయింది. కుల మత ప్రాంతీయ భాషలకు అతీతంగా పలువురు ప్రముఖ గురువుల శిష్యులు 300మందికిపైగా నృత్యకళాకారులు, గాయకుల దేశభక్తిగీతాలు ఆహుతులైన ప్రేక్షకులను, దేశభక్తులను చైతన్యపరచడమే కాకుండా ఉర్రూతలూగించాయి. ఇందులో భాగంగా నమోనమో భారతాంబి; ఏ మేరా ఇండియా ఐ లవ్ మై ఇండియా; ఇదిగో భద్రాది; గణపతికౌత్వం; ముద్దుగారే యశోదా; మహాగణపతి మనసాస్వరామి; పాడవోయి భారతీయుడా; నాజన్మభూమి; జననీ జన్మభూమి; హమ్ ఇండియావాలే తదితరాలు మంత్రముగ్ధలను చేశాయి.

సంస్థ అధ్యక్షురాలు లలితారావు నిర్వహణలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోలేటి దామోదరగుప్తా, విశిష్ట అతిథులుగా దైవజ్ఞశర్మ, గీతాసాంగ్, తుమ్మలపల్లి రామసత్య నారాయణ, చకిలం స్వప్న తదితరులు పాల్గొని ఈనాటి జయహో భారత్‌లో పాల్గొన్న గురువుల ను ఘనంగా సన్మానించి వారి శిష్యులకు జ్ఞాపికల ను అందజేసి ఎంతగానో అభినందించారు.

# మల్లారెడ్డి అగ్రికల్చర్ కళాశాల ముందు విద్యార్థుల ఆందోళన

-కళాశాల ఫర్నిచర్ ధ్వంసం..

-విద్యార్థుల ఆందోళనకు విద్యార్థి సంఘాల మద్దతు

-యాజమాన్యం దిగిరావడంతో శాంతించిన విద్యార్థులు



మల్లారెడ్డి అగ్రికల్చర్ కళాశాల ముందు ఆందోళన చేపడుతున్న విద్యార్థుల



**పేట్ బషీరాబాద్, ఆగస్ట్ 10, ప్రభాతవార్త** మైసమ్మగూడలోని మల్లారెడ్డి అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాలలో హార్ట్ఎటాక్‌తో మృతి చెందిన బీటెక్ ఫస్టియర్ స్టూడెంట్‌కు న్యాయం చేయాలని, కళాశాలలో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ విద్యార్థులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. శనివారం వందలాది మంది విద్యార్థులు కళాశాల ముందు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే మల్లారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. సోఫాకు నిప్పటించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దాదాపు 3 గంటల నుంచి 4 గంటల వరకు కళాశాల ముందు ఆందోళన చేపట్టారు. విద్యార్థులు ఆందోళనకు ఏబీవీపీ, ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘాలఉ మద్దతు తెలపడంతో ఆందోళన తారాస్థాయికి చేరింది. మల్లారెడ్డికి వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన నినాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. పోలీసులు జోక్యం చేసుకున్నప్పటికీ విద్యార్థులు ఎక్కడ తగ్గలేదు. చివరకు మల్లారెడ్డి కొడుకు మహేందర్‌రెడ్డి, కోడలు ప్రీతిరెడ్డి దిగివచ్చి పరిస్థితిని శాంతింప చేశారు. విద్యార్థుల సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. హార్ట్ఎటాక్‌తో మృతి చెందిన అరుణ్ కుమార్ అనే విద్యార్థికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో చివరకు విద్యార్థులు శాంతించారు.

**అసలు ఏం జరిగింది..**

అగ్రికల్చర్ యూనివర్సిటీలో మొదటి సంవత్సరం చదువుతున్న అరుణ్ కుమార్ అనే విద్యార్థి తరగతి గదిలో ఉండగా హార్ట్ఎటాక్‌తో మృతి చెందాడు. విద్యార్థి మృతికి కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యమే కారణం అంటూ విద్యార్థి సంఘాలు, విద్యార్థులు ఆరోపణలు చేస్తున్నారు. సకాలంలో అంబులెన్స్‌ను అరెంజ్ చేయకపోవడం వల్ల విద్యార్థి మృతి చెందాడని విద్యార్థులు విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. దాదాపు 20 నిమిషాలు ఆలస్యంగా ఆసుపత్రికి వెళ్లడం వల్ల అరుణ్ కుమార్ మృతి చెందాడని ఇది ముమ్మాటికి కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని విద్యార్థులు విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. ప్రతి క్యాంపస్‌కు ఒక అంబులెన్స్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు సౌకరానయలు కల్పించాలంటూ విద్యార్థులు, విద్యార్థి సంఘ నేతలు ఆందోళన చేపట్టారు.

**విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తాం : ప్రీతిరెడ్డి**

విద్యార్థుల డిమాండ్లన్నీ పరిష్కరిస్తామని, ముఖ్యంగా అన్ని క్యాంపస్లకు అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తామని మల్లారెడ్డి విద్యా సంస్థల డైరెక్టర్ ప్రీతిరెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థులకు హెల్త్ చెకప్ క్యాంపులను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఫస్ట్ ఇయర్ అగ్రికల్చర్ స్టూడెంట్ హార్ట్ ఎటాక్‌తో చనిపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

# ప్రోటోకాల్ ఉల్లంఘనపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే కృష్ణారావు



**మూసాపేట్, ఆగస్ట్ 10, ప్రభాతవార్త** కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రోటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ని శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కలిసి ఫిర్యాదు చేశారు. మూడుసార్లు ప్రజల మద్దతుతో భారీ మెజార్టీతో గెలుపొందిన తాను ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుంటే కొందరు అధికారులు ప్రోటోకాల్ ఉల్లంఘిస్తూ పనులు చేయకుండా పబ్బం గడుపుతున్నారని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం చేపట్టే పనులు కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతుంటే ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడాన్ని స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లారు. సానుకూలంగా స్పందించిన స్పీకర్ వెంటనే ప్రోటోకాల్ సంబంధిత విభాగాల ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి శాసనసభ్యుడి హక్కులకు భంగం కలిగించే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రోటోకాల్ ఉల్లంఘనలు పునరావృతం ఐతే తీవ్ర చర్యలఉ తప్పవని హెచ్చరించారు.

# జిహెచ్‌ఎంసి మేయర్ వీడియోలు మార్ఫింగ్

## -దిల్‌షుఖ్‌నగర్‌లో వ్యక్తి అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్టు 10,ప్రభాతవార్త:** ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ తన మార్ఫింగ్ వీడియోలను సోషల్‌మీడియాలో వైరల్ చేస్తున్నారని సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈనేపథ్యంలో తనకు తెలియకుండా, తనను టార్గెట్ చేస్తూ కొంతమంది కావాలనే అసభ్యకర వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకో వాలని కోరింది. దీంతో కేసు నమోదు చేసుకుని రంగంలోకి దిగిన పోలీసులు ఆవీడియోలు పోస్టు చేసిన వ్యక్తి దిల్‌షుఖ్‌నగర్‌కు చెందిన చామకూర లక్ష్మణ్‌గా గుర్తించారు. ఈనేపథ్యంలో శనివారం అతనిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిం చారు. అలాగే ఈపోస్టులను ఉద్దేశపూర్వకంగానే వైరల్ చేస్తున్నారని గుర్తించి ప్రధాన నిందితుల కోసం గాలిస్తున్నారు.

# ప్రమాదవశాత్తూ జారిపడి భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు

**కంటోన్మెంట్,ఆగస్టు 10 ప్రభాతార్త:** భవన నిర్మాణం పనులు చేస్తుండగా గోవా కర్ర విరిగి ప్రమాదవశాత్తూ రెండు అంతస్థుల భవనం నుంచి భార్య,భర్తలు ఇద్దరు పడిపోగా భర్త మృతి చెందగా భార్య మృత్యువుతో పోరాడుతున్న సంఘటన గోపాలపురం పోలీస్టేషన్ పరిదిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన బైరాగి (56),భార్యలక్ష్మి (45) పొట్టకూటి కోసం నగరానికి వల సవచ్చి సికింద్రాబాద్ కళాసిగూడలో నివాసం ఉంటున్నారు. భర్త మేస్త్రీగా, భార్య భవన నిర్మాణ కూలీగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు.ఈ నెల 9న సాయంత్రం రెజిమెంటల్ బజార్‌లోని 3 అంతస్థుల భవనంలో స్లాబ్ వేస్తుండగా ప్రమాదవశాత్తూ 2 అంతస్థుల భవనం నుంచి భర్త బైరాగి, భార్య లక్ష్మిలు ప్రమాదవశాత్తూ జరి కింద పడిపోయారు. తీవ్రగాయాలపాలైన భార్య,భర్తలు చికిత్సనిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా బైరాగి మార్గం మధ్యలోనే మృతి చెందాడు. భార్యలక్ష్మి గాంధీ ఆసుపత్రిలో చికిత్సపొందుతుంది. కుమారుడు జగదీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపాపురం పోలీస్‌లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# టాస్క్‌ఫోర్స్ పోలీసులమంటూ బెదిరించిన హోంగార్డు, మరో యువకుడు అరెస్ట్

**పంజగుట్ట, ఆగస్టు 10 (ప్రభాతవార్త):** గుట్కా ప్యాకెట్‌లు పెద్దమొత్తంలో అమ్ముతున్నారు..మాకు సమాచారం వచ్చింది..అంటూ హడావుడి చేసిన ఇరువురు వ్యక్తులను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమూండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బంజారాహిల్స్ రోడ్డునంర్2లో శ్రీకాంత్ అనే వ్యక్తి జీవనోపాధికై పాన్‌షాప్ నడుపుకుంటూ బ్రతుకుతున్నాడు.గత రెండు రోజుల క్రితం ఇద్దరు వ్యక్తులు బైక్‌పై షాప్‌వద్దకు వచ్చి తాము టాస్క్‌ఫోర్స్ పోలీసులము అంటూ షాపులో వెదకసాగారు. భీతిల్లిన శ్రీకాంత్ తాను న్యాయంగా వ్యాపారం చేసుకుంటున్నానని ఎంత చెప్పినా వినకుండా బెదిరింపులకు దిగారు.మీరు పెద్ద ఎత్తున గఉట్కా అమ్ముతున్నారంటూ తమ వద్ద పక్కా సమాచారం ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాము తనిఖీలకు వచ్చామని, అధికారులు రాకముందే తమకు కొంత నగదు అప్పచెబితే ఇక్కడ ఏం లేవని తాము సమాచారం ఇస్తామని బేరసారాలకు దిగారు. దీంతో అనుమానం వచ్చిన శ్రీకాంత్ అక్కడే ఉన్న అతని సోదరుడు ఈ విషయమై బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ఇరువురు వ్యక్తులను విచారించగా వారు అబద్దాలు చెబుతున్నారని నిరూపణ అయింది. అయితే బెదరించిన ఇద్దరు యువకులలో ఒకరు సైబరాబాద్ లిమిట్స్‌లో ఎస్‌వోటీలో హోంగార్డుగా పనిచేస్తున్నట్లు పోలీసులు విచారణలో వెల్లడించారు. రెండో యువకుడు నకిలీ ఎస్ఐగా హడావుడి చేసిన వ్యక్తి నర్సారెడ్డిగా పోలీసులు గుర్తించారు. విలాసాలకు అలవాటు, చెడు వ్యసనాలకు బానిసై ఇలా అడ్డదారిన డబ్బులు సంపాదించాలనే ఆలోచనలతో ఈ పనికి పూనుకున్నట్లు వారు పోలీసుల విచారణలో చెప్పారు.వీరిరువురిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు....

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా రాజ్యాంగ బద్దమే : జస్టిస్ చంద్రకుమార్



ప్రసంగిస్తున్న జస్టిస్ చంద్రకుమార్, విశ్రాంత ఐఎఎస్ అధికారి ఐ.సామ్యూల్ తదితరులు

**చిక్కడపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త:** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా రాజ్యాంగ బద్దమేనని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ స్పష్టం చేశారు. శనివారం ఇందిరాపార్కు వద్ద ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో దళిత క్రైస్తవులకు రాజ్యాంగ హక్కులను నిరాకరిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వు(షెడ్యూల్డ్ కులాలు) 1950లోని 3వ పేరా అమలులోకి వచ్చిన రోజు సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపకుడు గద్దపాటి విజయరాజు అధ్యక్షతన 'దళిత క్రిస్టియన్స్ జాతీయ నిరసన దినం' సందర్భంగా జరిగిన సభలో జస్టిస్ చంద్రకుమార్ పాల్గొని ప్రసంగించారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు ఆయన విజ్ఞప్తిచేశారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ.సామ్యూల్ మాట్లాడుతూ కెజి.బాలకృష్ణన్ కమిటీ దళిత క్రైస్తవ పల్లెలు సదర్శించి వారి జీవితాలను అధ్యయనంచేయాలని కోరారు. దళిత క్రైస్తవులకు ఎస్సీహోదా కల్పించాలని జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివవేదిక సమర్పించడం జరిగిందని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పిఎల్. విశ్వేశ్వరరావు గుర్తుచేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ, రెవరెండ్ ఫాదర్ రాజు అలెక్స్, ఫాదర్ బోస్కో, రెవరెండ్ బి.భాస్కర్, శ్రీనివాస్‌నాయక్, డిబిఎఫ్ జాతీయ కన్వీనర్ పి.శంకర్, విసికె రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, అధికా ప్రతినిధి అంజన్న, దళిత స్త్రీశక్తి జాతీయ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వి.నతానియేలు, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గిడియేనుబాబు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.శామ్యూల్, కోశాధికారి సాల్మన్ రాజ్, రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు ఎన్ని నిధులైనా వెచ్చిస్తాం : ఎమ్మెల్యే వివేకానంద



మొక్కలు నాటుతున్న ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే వివేకానంద

**జీడిమెట్ల, ఆగస్ట్ 10, ప్రభాతవార్త** కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచేందుకు మౌలిక వసతుల కల్పనకు ఎన్ని నిధులైన వెచ్చిస్తామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. శనివారం 125 గాజులరామారం డివిజన్ కైలాష్‌హిల్స్ నందు 29.60లక్షల రూపాయలతో నూతనంగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మల్కాజగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పేదళ్ల కాలంలో నియోజకవర్గంలోని జిహెచ్ఎంసిలోని అన్ని డివిజన్‌లతో పాటు, నిజాంపేట్ కార్పొరేషన్, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి ఎంతో అభివృద్ధి చేశామని అన్నారు. రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గంలో మరిన్ని మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, డివిజన్ అధ్యక్షులు విజయరామ్‌రెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలను అలవర్చుకోవాలి

**-కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**



**అత్తాపూర్ ఆగస్టు10,ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలను అలవర్చుకోవాలని రాజేంద్రనగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.అత్తాపూర్ పరిధిలోని భాగ్య నగర్ శ్రీ రామచంద్ర స్వామి 27 అడుగుల విగ్రహ ప్రతిష్టాపనను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మైలర్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొని రామ చంద్ర మూర్తుల విగ్రహాన్ని ఆవిష్కరించారు.అనంతరం కార్పొరేటర్‌ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ....ఇలాంటి గొప్ప అవకాశం నాకు రావడం అదృష్టంగా భావి స్తున్నానని అన్నారు.స్వామివారి చల్లని ఆశీస్సులు ప్రజలందరూపై ఉండి సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవితాంతం అష్టశ్వర్యాలతో ఆనం దంగా ఉండాలనా స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో సుభి క్షంగా వర్షాలు కురిసి పాడిపంటలతో ప్రజలందరూ జీవితాంతం ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో దేవలయ కమిటీ సభ్యులు వాసు, వెంకట్ రెడ్డి,విజయ స్వామి,గణేష్,దేవల కమిటీ సభ్యులు,పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేయాలి

**-అత్తాపూర్ డివిజన్ బిజెపి కార్యవర్గ సమావేశం**



**అత్తాపూర్ ఆగస్టు10,ప్రభాతవార్త :** పార్టీ బలోపేతానికి నాయకులు, కార్య కర్తలు అహర్నిశలు కృషి చేయాలని పలువురు బిజెపి నేతలు పేర్కొన్నా రు.శనివారం అత్తాపూర్ డివిజన్ బిజెపి కార్యవర్గ సమావేశాన్ని డివిజన్ అధ్యక్షుడు సాభాద విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథులుగా జిల్లా నాయకులు ఎస్.ప్రభాకర్ రెడ్డి,చేవెళ్ల బిజెపి పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి,జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌లు హాజరై మాట్లాడారు...పార్లమెంట్ ఎన్నికల్లో ఏవిధంగా అయితే కలి సికట్టుగా పోరాడమో అదేవిధంగా రాబోయే ఎన్నికల్లో కలిసికట్టుగా పోరాడి బిజెపి బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి వివరించాలని సూచించారు.దేశ అభివృద్ధి ప్రధాని నరేంద్రమోడీతోనే సాధ్యమని చాటిచెప్పాలని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా బిజెపి గెలుపే లక్ష్యంగా పనిచేస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.నరేంద్రమోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయాలని వచ్చే ఎన్నికలో తెలంగాణ బిజెపి జెండా ఎగర డమ ఖాయమని దీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్,బిజెపి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథన్ గౌడ్ మృతి తీరని లోటు

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 10, ప్రభాతవార్త :**

మోతీనగర్ ప్రాంతంలోని ప్రజలకు ఎన్నో సేవలు అందించి జగన్నాథన్ గౌడ్ మృతి తీరని లోటు అని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు.దాదాపు 8దశాబ్దాలుగా ఈప్రాంతంలోని ప్రజలకు అన్ని విధాల సేవలు అందించిన జగన్నాథన్ గౌడ్ వయో భారంతో శనివారం ఉదయం ఆయన స్వగృహంలో మృతిచెందారు.ఆయన పార్థవ దేహాన్ని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావుతో పాటు కార్పోరేటర్ కోడచర్ల మహేందర్ , మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్‌కుమార్, మోతీనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సోసైటీ మాజీ అధ్యక్షులు ఎన్ అంజిరెడ్డి, కడపన్న గోపల్‌రెడ్డి, గోపిశెట్టి రాఘవేందర్, నాగేశ్వరరావు, మహ్మద్‌ఆలీ, నాగుల సత్యం, రాజ్‌కుమార్‌గౌడ్, తదితరులు ఆయన పార్థవ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం పిఆర్‌నగర్ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

## గంజాయి చాక్లెట్లు అమ్ముతున్న నిందితుడి అరెస్టు..

**పేట్ బషీరాబాద్, ఆగస్ట్ 10, ప్రభాతవార్త**

డిపిఈఓ మేడ్చల్ ఫయాజుద్దీన్ ఆధ్వర్యంలో ఏపీ, ఈఎస్ మాదవయ్య పర్యవే క్షణలో శనివారం సుభాష్‌నగర్‌లోని గంపల బస్తీలో గంజాయి చాక్లెట్లు అమ్ము తున్నారనే సమాచారంతో సిఐ యాదయ్య, ఎస్ఐలు రామకృష్ణ, రవి, కానిస్టేబు ల్స్ సీతారాం, ప్రవీణ్‌లతో కూడిన బృందంతో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో బీహార్‌కు చెందిన వ్యక్తి అభయ్ గిరి బిహార్ నుండి గంజాయిని తెచ్చి వాటిని చిన్న చిన్న చాక్లెట్స్ ప్యాకెట్స్‌లాగా చేసి, అవసరమైన వ్యక్తులకు విక్ర యిస్తున్నాడన్న సమాచారంతో తనిఖీ నిర్వహించగా.. 4.47కేజీల ఎండు గంజా యి, 0.75కేజీల గంజాయి చాక్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడు అభయ్‌గిరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీ సులు తెలిపారు.

## బేగంపేట సిబిఎన్ నగర్‌లో సెక్యూరిటీ గార్డు ఇంట్లో చోరీ

**బేగంపేట ఆగస్టు 10,ప్రభాతవార్త**

తల్లి చనిపోవడంతో ఆమె పార్థివ దేహాన్ని స్వగ్రామమైన సిద్దిపేటకు తీసుకుని వెళ్లి ఆమె అంత్యక్రియలు పూర్తి చేసుకుని ఇంటికి తిరిగి వచ్చి చూస్తే దొంగలు ఇల్లు గుల్ల చేసారు.ఇంటి గేటు తాళంతో పాటు ఇంట్లోని బీరువా తాళాలు పగుల గొట్టి అందిన మేర దోచుకుపోయిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రసూల్‌పురా సీ బీ ఎన్ నగర్‌లో చోటు చేసుకుం ది.ఈ సంఘటనపై బాధితుని ఫిర్యాదు మేరకు బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసారు.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రసూల్‌పురా సీ బీ ఎన్ నగర్‌లో కనకయ్య అనే వ్యక్తి నివసిస్తుంటాడు.ఇతను సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు.గత నెల 30న తన తల్లి మృతి చెందడంతో ఆమె అంత్యక్రియలను నిర్వహించేందుకు సిద్దిపేటకు వెళ్లారు .అక్కడ అంత్యక్రియలు పూర్తయిన తర్వాత ఈ నెల 4వ తేదీన ఒక సారి సీబీఎన్ నగర్ కు వచ్చి ఇంట్లోని వస్తువులను అన్ని సర్దుకుని ఇల్లు శుభ్రం చేసుకుని తిరిగి సిద్దిపేటకు వెళ్లిపోయారు.తిరిగి శనివారం ఉదయం సిద్దిపేట నుంచి రసూల్‌పురా సీ బీ ఎన్ నగర్‌కు వచ్చి చూడగా ఇంటి గేటు తాళం పగులగొట్టి ఉంది.ఇది గమనించి లోనికి వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న బీరువా తాళాలు పగులగొట్టి ఉంది.బీరువాలో ఉన్న 50 తులాల వెండి,15తులాల బంగారు ఆభరణాలు,రూ 5000లు నగదు కనిపించకపోవడంతో బాధిత కుటుంబం బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది.సంఘటనా స్థలాన్ని క్లూస్ టీం,ఫింగర్ ప్రింట్స్‌సందర్శించి ఆధారాలు సేకరించారు.ఈ సంఘ టనపై కనకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీ ఐ మల్లేషం తెలియజేసారు.

### పోలీసులపై దాడికి యత్నించిన యువకుడు అరెస్ట్.

**పంజగుట్ట, ఆగస్టు10 (ప్రభాతవార్త):** మద్యంమత్తులో పోలీసులపై దాడికి యత్నించిన ఘటనలో జూబ్లీహిల్స్ పోలీసులు ఓ యువకుడిని అరెస్ట్ చేసిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలప్రకారం శుక్రవారం రాత్రి పన్నెండు గంటల తర్వాత జూబ్లీహిల్స్‌లోని నీరూస్ చౌర స్తాలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరిక్షలు చేస్తున్నారు. అదే సమ యంలో నానక్‌రామ్‌గూడకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి రుచీత్‌రెడ్డి తన మిత్రులతో కలసి అక్కడకు దగ్గరలో ఉన్న ఓ పబ్‌లో పూటుగా మద్యం సేవించి కారులో వేగంగా ఆ రహదారిలో వచ్చాడు. పోలీసులు అతనిని ఆపి డ్రంక్‌అండ్‌డ్రైవ్ టెస్ట్‌కు సహకరించాలని అభ్యర్థించారు. పోలీసులు ఎంత చెప్పినా వినకుండా పోలీసులపై నానా యాగీ చేసి మీ అంతు చూస్తానంటూ హెచ్చరికలకు దిగాడు.ఫుల్‌గా తాగిన మైకంలో ఏం మాట్లాడుతున్నాడో అర్థం కాక వీరంగం సృష్టించాడు.జూబ్లీహిల్స్ ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో అక్కడ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎస్ఐతో పాటు సిబ్బంది మర్యాదగా సహకరించాలని కోరినా ఆ యువకుడు వినలేదు.చాలాసేపటి వరకు వాగ్వివా దానికి దిగుతూనే రుచిత్ ఉన్నాడు.ఎంత చెప్పినా వినకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.పోలీసుల పట్ల అసభ్యంగా వ్యవహరించిన రుచిత్‌రెడ్డిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసునమోదు చేసి అతను ఉపయోగించిన కారును పోలీసులు సీజ్ చేశారు.



జిల్లా అధ్యక్షులు చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న మల్లేష్‌గౌడ్

## గౌడుల అభ్యున్నతికి కృషి : మల్లేష్‌గౌడ్

**షాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** గౌడుల అభ్యున్నతి కోసం తాను కృషి చేస్తానని గౌడ కులహక్కుల పరిరక్షణ సమితి మండల అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన గంగాపురం మల్లేష్‌గౌడ్ అన్నారు. గౌడ కుల హక్కు ల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రేనట్ల మల్లేష్‌గౌడ్ చేతుల మీదుగా శనివారం సమితి మండల అధ్యక్ష నియామక పత్రాన్ని మల్లేష్‌గౌడ్ అందు కున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....గౌడులు అన్ని రంగా ల్లో రాణించాలని, అందుకు అందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. గౌడ కార్మికుల సమస్యల పరిష్కారానికి హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. కల్లుగీత కార్మికు లకు ప్రభుత్వం అన్ని విధాల ఆదుకునేలా సంక్షేమ పథకాలు తీసుకురా వాలని కోరారు. తమపై నమ్మకంతో మండల బాధ్యతలు అప్పగించినం దుకు జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్య క్రమంలో గౌడ సంఘం నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

## చందన్‌వెల్లి ఉచిత వైద్య శిబిరం విజయవంతం




వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

**షాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** షాబాద్ మండలం చందన్‌వెల్లి గ్రా మంలో వెల్స్పన్ ఫౌండేషన్, భాస్కర్ ఆసుపత్రి, శ్రీబాలాజీ దంత వైద్య శాల వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో సుమారు 76మంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకుని మందులు, ఇంజెక్షన్లు తీసుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ క్రాంతి మాట్లాడుతూ....భాస్కర్ ఆసుపత్రి గత 8సంవత్సరాలుగా రోగుల కు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తుందన్నారు. కావున గ్రామస్థులు ఉపయోగించుకోవాలన్నారు. వెల్స్పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ సురేఖ మాట్లాడుతూ....పెద్దలందరికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, మం దులు ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామస్థులకు స్త్రీలకు సంబం ధించిన వైద్య నిపుణులు, కంటి, దంత, కీళ్ల, సాధారణ, మానసిక,చిన్న పిల్లలకు సంబంధించిన వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వెల్స్పన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, రమేష్, భాస్కర్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

**మాజీ జడ్పీటిసి జర్పుల దశరథ్ నాయక్**



**కడ్తాల్,ఆగస్టు 10 ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలని రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్, మాజీ జడ్పీటిసి జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కడ్తాల్ మండల పరిధిలో ఉన్న అనుమసుపల్లి గ్రామం లో ప్రతినెల రెండవ శనివారం శ్రీ పరమేశ్వర వీరాంజనేయ స్వామి ఆల యంలో క్యాతిక లక్ష్మమ్మ, పర్వతాలు వారి కొడుకు, కోడలు అమూల్య రవికుమార్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిరమిడ్ ట్రస్టు ఛైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటిసి దశరథ్‌నాయక్ స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపిటిసి లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు మం గళపల్లి నరసింహరాజుగౌడ్, నరసింహగౌడ్, కృష్ణయ్య, రామకృష్ణ, నరేష్, గోపియా జంగయ్య,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మా స్కూల్‌కు నో రూల్స్..!

**నిబంధనలకు విరుద్ధంగా రెండవ శనివారం**

**పాఠశాల కొనసాగింపు... ఆందోళన చేపట్టిన విద్యార్థి సంఘాలు**

**అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**తాండూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త :** అన్ని పాఠశాలల తీర ఒకటైతే.. మా పాఠశాల తీరు మరీ సఫరేట్.. మా పాఠశాలకు నో రూల్స్ అంటూ వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని ఓ స్కూల్ యాజమాన్యం బరి తెగింపు చర్యలకు పాల్పడుతుంది. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సెలువు రోజు రెండవ శనివారం పాఠశాల కొనసాగించడంపై విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘం జిల్లా నాయకులు దీపక్‌రెడ్డితో పాటు మరి కొందరు నాయకులు పాఠశాలకు చేరుకొని యాజమాన్యాన్ని నిలదీశారు. ప్రభుత్వ సెలువు రోజు పాఠశాలను ఎలా కొనసాగిస్తారంటూ వాగ్వివాదానికి దిగారు. తమ పై అధికారుల ఆదేశాల మేరకు పాఠశాల కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలపడం కొసమెరుపు. అయితే, ఈ విషయంపై పాఠశాల యాజమాన్యం సంఘటనను బయ టకు పొక్కనీయకుండా ముడుపులు చెల్లించనట్లు తెలిసింది. ఆగమేగాలపై పాఠశాల వద్దకు చేరుకున్న విద్యార్థి సంఘం నాయకులు యాజమాన్యం చేత ముడుపులు తీసుకొని మిన్నకుండి పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడ విద్యార్థి సంఘం నాయకులు పలు సంఘటనల్లో మీడియాను వాడుకుంటు పబ్బంగడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## పేదలకు శ్రీరామరక్ష సిఎం రిలీఫ్‌ఫండ్ : ఎమ్మెల్యే

**శంషాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త**

అనారోగ్యంతో బాధపడుతూ వివి ధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పలువురు పేదలకు సిఎ సహాయని ధి ద్వారా మంజూరైన ఆర్థిక సాయాన్ని (చెక్కులు) ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ శనివారం పంపిణీ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన 29 మంది లబ్దిదారులకు 8లక్షల 62 వేల 500 రూపాయల విలువగల చెక్కు లను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమం లో పార్టీ సీనియర్ నాయ కులు కోడిగంటి చంద్రారెడ్డి నీరటి రాజు ముదిరాజ్ మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు దండు ఇస్తారి, చిన్న గోల్కొండ సింగిల్ విండో ఛైర్మన్ దవణాకర్‌గౌడ్ ఆయా గ్రామాల మాజీ సర్పంచులు మా జీ ఎంపిటిసి లబ్దిదారులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.




మందులు పంపిణీ చేస్తున్న చైర్మన్ చల్లా నర్సింహ్మారెడ్డి

## అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలి

**చల్లా నర్సింహ్మారెడ్డి**

**మహేశ్వరం, ఆగస్టు 10, ప్రభాతవార్త :** వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఉండాలనే మంచి ఉద్దేశ్యంతో స్వచ్ఛందంగా కార్యక్రమాలు నిర్వహించడం ఆదర్శనీయమని తెలంగాణ పట్టణ ఆర్థిక మరియు మౌళిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నర్సింహ్మారెడ్డి అన్నారు. ఆర్ట్ ఫౌండేషన్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం మహేశ్వరం మండలము చిన్నతుప్రా గ్రామంలో జరిగింది. ఈ కార్యక్ర మానికి చైర్మన్ చల్లా నర్సింహ్మారెడ్డితో పాటు జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ తీగల అనిత రెడ్డితో కలిసి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండాలనే ఉద్ధేశ్యంతో గ్రామ యువకులు ఆర్ట్ ఫౌండేషన్ వారి సహకారంతో ముందుకు వచ్చి స్వచ్ఛంద సేవా కార్యక్ర మాలు చేపట్టడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఆరోగ్యశ్రీ పథకాన్ని ఐదు లక్షల నుండి పది లక్షలకు పెంచి ప్రజా ప్రభుత్వంగా ముందుకు సాగుతుం దని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యాద య్య, రాజు, రాఘవేందర్, ఫౌండేషన్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం : ఎఇ సురేందర్

**శామీర్‌పేట, ఆగస్టు 10, ప్రభాతవార్త** దేవరయాంజాల్ విద్యుత్ సబ్‌స్టేష న్‌లో 11కెవి డిఎంసి ఫీడర్‌కు సంబంధించి మరమ్మతు పనుల కారణంగ ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుం దని వినియోగదారులు సహకరించాలని శామీర్‌పేట విద్యుత్ ఎఇ సురేందర్ పేర్కొన్నారు. శామీర్‌పేట సెక్షన్ పరిధిలోని దేవరయాంజాల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11కెవి డిఎంసి ఫీడర్ పైన ఉన్న చెట్ల కొమ్మలు తొలగించుట కొరకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు దేవరయాంజాల్ సబ్‌స్టేషన్ నుంచి అర్కలగూడ వరకు గల గోదాములకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అదే విధంగ మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అరికలగూడెం నుంచి డిఎంసి వై జంక్షన్ వరకు గల గోదాములకు, వ్యవసాయ కనెక్షన్స్‌కు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎఇ సురేందర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరిం చాలని ఆయన కోరారు.

## శ్రీవిష్ణు,శివాలయం వద్ద అన్నదానం



శ్రీవిష్ణు,శివాలయం వద్ద అన్నదాన కార్యక్రమం దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 10, ప్రభాతవార్త ఉద్దెమర్రిలోని** శ్రీవిష్ణు,శివాలయం (అక్కన్న,మాదన్నలు నిర్మించిన పూర్వఆలయం)లో శనివారం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం జరిగింది. శనివారం మూడుచింతలపల్లి మం డలంలోని ఉద్దెమర్రిలోని శ్రీవిష్ణు,శివాలయంలో శ్రీవేంకటేశ్వర స్వామికి, శివునికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి శనివారం, సోమవారం ప్రత్యేక పూజలు జరపటంతో పాటు నిత్య పూజలు కూడ నిర్వహి స్తున్నా రు. అదే విధంగ గత కొన్నాళ్ల నుంచి ప్రతి శనివారం దాతల సహ కారం తో ఈ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఉద్దెమర్రి గ్రామానికి చెందిన బర్ల రమేశ్, నాగ మణి దంపతులు నిర్వహించారు. దీనికి ముందుగా శ్రీస్వాముల వారికి పూజలు చేసి ఆ తరువాత అన్నదా న కార్యక్రమాన్ని నిర్వహించారు. వారికి ఆలయ చైర్మన్ ఆడెపు ఉమా మహేశ్వరి, సభ్యులు రవీందర్‌గౌడ్, సామల రాజిరెడ్డి, బురిగల్ల రమేశ్‌లు వారికి దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు దాతలు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఇంటింటా మొక్కలు నాటాలి

**మున్సిపల్ చైర్మన్ కె.రాజేశ్వర్‌రావు**



మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు,పాల్గొన్న కౌన్సిలర్ సురేశ్, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు

**శామీర్‌పేట, ఆగస్టు 10, ప్రభాతవార్త** ప్రతి ఒక్కరు ఇంటింటా మొక్కలు నాటాలని, ఖాళీ స్థలాల్లోనూ మొక్కలను నాటాలని,పర్యావరణ పరిరక్షణ కు దోహదపడాలని తూంకుంట మున్సిపల్ చైర్మన్ కె.రాజేశ్వర్‌రావు కోరారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని 9వ వార్డు హకీంపేట్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం సందర్భంగ చైర్మన్ రాజేశ్వర్‌రావు మొక్కలను నాటారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున ప్రజలు భాగస్వాములు అయి మొక్కలు నాటాలన్నారు. అదే విధంగ వర్షాకాలం కావటంతో సీజనల్ వ్యాధులు ప్రభల కుండ పరిశుభ్రత పాటించాన్నారు. ఇళ్లతో పాటు ఇళ్ల పరిసరాలు, కాలనీలు అన్ని పరిశుభ్రత పాటించాలని, పారిశుద్యం అమలు చేయాలన్నారు. వనమహోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ ప్రతి వార్డులో ప్రతి ఇంటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేయటం జరిగిందని, మొక్కలను నాటాలని పచ్చదనాన్ని పెంచాలని చైర్మన్ రాజేశ్వర్‌రావు సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ఐదు రోజుల పాటు జరిగిందని వైస్‌చైర్మన్, పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు వివిధ వార్డులలో మున్సిపాల్టీ పరిధిలో పాల్గొనటం జరిగిందన్నారు. దీనిలో వారితో పాటు మున్సిపల్‌లోని వివిధ వార్డులలో స్పెషల్ ఆఫీసర్ వీణ, కమిషనర్ వెంకటగోపాల్, మేనేజర్ శ్రవన్‌కుమార్, డిఇ సునీత, అధికారులు, సిబ్బంది, బిల్‌కలెక్టర్లు,మెప్మా సిబ్బంది, అంగ న్‌వాడి టీచర్లు, ఆశవర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనటం జరిగిందని అన్నారు. హకీంపేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సురేశ్‌తో పాటు వార్డు ఆఫీసర్ పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

## పంట సాగు వివరాలు నమోదు చేసుకోవాలి : గీతారెడ్డి

**ఆదిభట్ల ఆగస్టు10,ప్రభాతవార్త :** రైతులు పంటల సాగు యొక్క వివరా లు వ్యవసాయ అధికారులకు తెలియజేయాలని జిల్లా వ్యవ సాయ అధికారిని గీతారెడ్డి పేర్కొన్నారు.ఆదిభట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్ పరిధిలోని ఫిరోజ్ గూడ రెవెన్యూలో రైతులు పండించిన పంటలను పరిశీ లించారు.అనంతరం వ్యవసాయ అధికారిని గీతారెడ్డి మాట్లాడుతూ.. .రైతులు పండించిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని విజ్ఞపినత చేశారు.ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంటల ప్రక్రియను సర్వేనెంబర్ ఆధారంగా పరిశీలించాలని తెలిపారు.రైతులు తప్పనిసరిగా వ్యవసాయ విస్తీర్ణ అధికారుల దగ్గర పంటల వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపా రు.రైతులు పంటలకు వాడాల్సిన క్రిమి సంహారక మందులపై అవగాహన కలిగి ఉండాలని వాటి పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని పంటలకు వాడా ల్సిన ఎగుల గురించి సమా చారం తెలుసుకుని తగిన మోతాదులో మం దులు వాడాలని సూచించారు. పంటల సాగు విషయంలో ఏదైనా సమస్య లు తలెత్తితే స్థానిక అధికారుల దృష్టికి తీసుకువస్తే రైతులకు సహకారంతో సూచనలు సల హాలు తెలిపి అధిక దిగుబడికి సహాయంగా ఉంటామని పేర్కొన్నారు.



పల్లకి సేవలో భజన చేస్తున్న భక్తులు

## శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా పల్లకీ సేవ

**శ్రీలక్ష్మీ గణేష్ బోర్ వెల్స్ శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం**

**షాద్‌నగర్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రావణ మాసం సందర్బంగా శనివారం భక్తులు ప్రత్యేక పూజలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వా మివారి పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని పల్లకి లో మోస్తూ శ్రీరామ జయరామ, జయజయ రామ నినాదాలతో ఆట, పాటలతో భజ నలతో పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు, భజనలతో ఆలయం లో శ్రీరామ నామస్మరణ మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీ ల్ పంతులు భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవాలయానికి వచ్చిన భక్తులకు అన్నారం గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీ గణేష్ బోర్‌వెల్స్ యజమాని శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేసిన శ్రీశైలం గౌడ్ దంపతులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపి పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పులిమామిడి శ్రీశైలంగౌడ్, వసంతరావు, అన్నారం రఘుగౌడ్, గడ్డమీ ద రమేష్ ముదిరాజ్, శ్రీశైలం యాదవ్, మంచిరేవుల అశోక్, రఘునందర్‌రెడ్డి, లక్ష్మణ్, బచ్చన్న, కిషన్ నాయక్, రాఘవేందర్, సుప్ప నర్సింలు, శ్రీనివాస్, నారా యణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణచారి, శంకర్ గౌడ్, యా దగిరి, పి.ప్ర వీణ్ గౌడ్, పద్మ వెంకటేష్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీని వాస్, రమే ష్, సుధాకర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, రవీందర్, మాజీ వార్డు సభ్యులు సింగ పాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం, మహిళలు,పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఆవోపా రాష్ట్ర కార్యదర్శిగా పలబట్ల ఆనంద్ బాబు



ఆనంద్‌బాబును సన్మానిస్తున్న ఆవోపా రాష్ట్ర అధ్యక్షులు

**షాద్‌నగర్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ఆవోపా కార్యదర్శిగా రం గారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పలబట్ల ఆనంద్ బాబుని నియమించారు. ఈ సందర్భంగా శనివారం షాద్‌నగర్ పట్టణంలో ఆవోపా రాష్ట్ర అధ్యక్షులు మలిపెద్ది శంకర్, ఆర్థిక కార్యదర్శి కందికొండ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కట్టా రవికుమార్, తదితరులు కలిసి ఆనంద్ బాబుని సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులను అలంకరించాలని వారు ఆకాంక్షించారు.

## హిందూ సమాజాన్ని రక్షించుకుందాం .!

**బంగ్లాదేశ్ ఘటనపై భగ్గుమన్న హిందూ ఐక్యవేదిక..తాండూరులో నిరసన ర్యాలీ**

**స్వచ్ఛందంగా బంద్ పాటించిన వ్యాపార సంస్థలు**




నిరసన ర్యాలీ చేపడుతున్న ఐక్యవేదిక ప్రతినిధులు

**తాండూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త :** హిందూ సమాజ పరిరక్షణకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు పిలుపునిచ్చారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై కొనసాగుతున్న దమన కాండకు నిరసనగా శనివారం ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చారు. ఐక్యవేదిక పిలుపు మేరకు తాండూరులో వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా పాటించారు. కార్యక్రమంలో భాగంగా ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని నెహ్రూగంజ్ ఎల్లమ్మ దేవాల యం నుండి శాంతియుతంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు, వ్యాపార సంఘాలు, వ్యాపారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సేవ్ హిందూస్ ఇన్ బంగ్లా దేశ్ అంటూ బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ..భారతమాతాకి జై అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. పట్టణంలోని ఇందిరాచౌక్‌లో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులపై నరమేధం, దాడులను ముక్తకంఠంతో ఖండించారు. దాడులకు పాల్పడుతున్న విద్రోహ శక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హిందువులందరు సంఘటితం కాలవాలని పిలుపుని చ్చారు. అనంతరం తాండూరు డిఎస్పీ కార్యాలయంలో డిఎస్పీ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యు.రమేష్‌కుమార్, రజనీ కాంత్, సుదర్శన్‌గౌడ్, నాగారం మల్లేశం, పర్యాద రామకృష్ణ, వివిద సంఘాల నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

## బౌద్ధమత ఆచారంలో పుణ్య సంస్కారం



పుణ్య సంస్కారంలో పాల్గొన్న నేతలు

**తాండూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త :** బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయిన చంద్రశేఖర్ తండ్రి పుణ్య సంసారాన్ని తాండూరులో తొలిసారి బౌద్ధ మత ఆచారంలో నిర్వహించారు. బంతే శీలరక్కిత్ తథాగత్ బుద్ధవిహార్ చేతుల మీదుగా కార్యక్రమాన్ని జరిపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బిఎస్పీ అధ్యక్షులు ప్రభాకరన మంద, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్, ప్రియదర్శిని, బిసి కమిషన్ సభ్యులు శుభప్రదపటేల్ తదిరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. గౌతమ బుద్ధుని విగ్రహాలు, చిత్రపటాలు పెట్టుకోవడమే కాకుండా.. ఆయన ఆచరించిన విధానాలను, జీవిత చరిత్ర తెలిసే విదంగా ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కొనియాడారు.



నగరంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన సినినటి లావణ్య త్రిపాఠి

### వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి: చైర్మన్

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని నారపల్లి శివాజీనగర్‌లో మున్సిపల్ సాధారణ నిధులు పది లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు చైర్మన్ శనివారం కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్‌లో వేగంగా వెలుస్తున్న కొత్త కాలనీల్లో దశ లవారిగా అభివృద్ధి పనులు చేపడు తున్నట్లు తెలిపారు.

## సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి గురుబ్రహ్మనగర్ సమస్య తీసుకెళతా : ఎమ్మెల్యే దానం



**పంజగుట్ట, ఆగస్టు 10 (ప్రభాతవార్త):**
జుబ్లీహిల్స్ డివిజన్‌లోని గురుబ్రహ్మనగర్ బస్తీలో ఎన్నో ఏళ్ళుగా జెఎన్ఎన్‌యూఆర్ఎం కింద గతంలో ఇళ్ళు మంజూరు చేశారని, రోశయ్య సీయంగా ఉన్న సమయంలో పట్టాలు ఇవ్వడం జరిగింద ని, తాజాగా ఇది గ్రీన్‌బెల్ట్ స్థలమంటూ అధికారులు కొంతమంది సొసైటీ పెద్దలకు మేలు చేసేందుకు ప్రయత్నిస్తున్నార.ఇ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యానించారు. శనివారం గురు బ్రహ్మనగర్‌ను సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. బస్తీలో రాకపోకలు నిలిపివేస్తూ ప్రహరీని నిర్మిస్తున్నారన్నారు. ఇక్కడ పార్క్ నిర్మిస్తే తమతో పాటు అందరూ సంతోషిస్తారని అలా కాకుండా ఎవరికో మేలు చేసేందుకు కొంతమంది అధికారులు ప్రయ త్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. గతంలో 150 మందికి అప్పు డు పట్టాలు ఇవ్వడం జరిగిందని,సీయం స్వయంగా వచ్చి ఇక్కడ ఫౌండేషన్ స్టోన్ కూడా వేయడం జరిగిందన్నారు.జుబ్లీహిల్స్ గురుబ్రహ్మనగర్‌లో ఎక్కువగా గిరిజనులు నివశించే ఈ ప్రాంతంలో స్థానికులకు న్యాయం చేయకుండా ప్రైవేటు వ్యక్తులకు లాభం చేకూర్చేలా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఆయన వ్యాఖ్యానిం చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా నుంచి రాగానే విషయం వివరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

### ప్రజల కోసం బిజెపి కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తారు : రామక్రిష్ణ



కంటోన్మెంట్‌లో బిజెపి కార్యకర్తల సమావేశమైన బోర్డు మెంబర్ రామక్రిష్ణ తదితరులు

**కంటోన్మెంట్, ఆగస్టు10 ప్రభాతవార్త:** బిజెపి కార్యకర్తలు, నాయకులు ఎల్లప్పుడు ప్రజల కోసం పనిచేస్తారని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్, బిజెపి రాష్ట్ర నాయకుడు జె.రామ క్రిష్ణ తెలిపారు. శనివారం 4వ వార్డులోని అంబేద్కర్ నగర్ హరజన బస్తీ, రామ్ నగర్, పికెట్ పరిసర ప్రాంతాల్లో బస్తీ బాట కార్యక్ర మంలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ యా బస్తీల్లో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఆయన దృష్టికి తెచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను వీలైనంత త్వర లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు బిజెపి అధ్యక్షుడు రాజ్ మల్లేశ్, అసెంబ్లీ కన్వీనర్ విజయానంద్, బిజెపి సీనియర్ నాయకులు టోపీ శంకర్, నాగభూషణ్ రెడ్డి, ఓంకార్, షిరీస్, లక్ష్మణ్, దీన్ దయాల్, ప్రేమ్‌కుమార్, సాయి తది తరులు పాల్గొన్నారు.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : కొంతం దీపిక



మారేడ్‌పల్లి నెహ్రూ నగర్ పార్కులో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

**కంటోన్మెంట్, ఆగస్టు10 ప్రభాతవార్త:** స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వెస్ట్ మారేడ్‌పల్లిలోని కస్తూర్బాగాంధీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి మోండా డివిజన్ కార్పొరే టర్ కొంతం దీపిక పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి సిబ్బంది గాయత్రి, సుధీర్, నర్సింగ్ రావ్, అనీల్, జహింగీర్,రాజు, కోటయ్య, బాలక్రిష్ణ, యాదయ్య పాల్గొన్నారు.

### మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి : కొంతం దీపిక

శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని వెస్ట్ మారేడ్‌పల్లిలోని పద్మశాలి కళ్యాణ మండపంలో నిర్వహించినమహిళా అభ్యుదయ సంఘం నిర్వహించిన హోమం,బొట్టు కార్యక్రమానికి కాశీపుణ్య క్షేత్రాన్ని దర్శించుకున్న జంప నప్రతాప్ కాశీపుణ్య క్షేత్రాన్ని దర్శిం చుకున్న జంపనప్రతాప్ ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్నిరం గాల్లో అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు గంజి రజిని పాల్గొన్నారు.

## కాశీపుణ్య క్షేత్రాన్ని దర్శించుకున్న జంపనప్రతాప్

**కంటోన్మెంట్, ఆగస్టు10 ప్రభాతవార్త:** హిందువులకు అత్యంత పవి త్రమైన కాశీ పుణ్యక్షేత్రాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ జంపన విద్యావతి దంపతులు శనివారం కాశీలోని త్రివేణి సంఘమైన గంగా,వరుణ ఆసి, విశ్వేశ్వర లింగం,అన్నపూర్ణ దేవాలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ గంగానదిలో స్నానం చేస్తే సర్వ పాపాలు పోయి పునర్ జన్మ ఉంటుందని భక్తుల నమ్మకం అన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ పొందాలి



మధురానగర్‌లో షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటిగోపీనాథ్

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 10, ప్రభాతవార్త :**
ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు పొందాలని గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షులు జూబ్లిహిల్స్ శాసన సభ్యు లు మాగంటి గోపినాథ్ అన్నారు.శనివారం వెంగళరావునగర్ డివిజ న్ పరిధిలోని మధురానగర్‌లో కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ 21 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.అదేవిధంగా 5మంది లబ్ధిదారులకు సిఎమ్ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈకా ర్యక్రమంలో కార్పొరేటర్ దేదిప్యవిజయ్‌కుమార్, విజయ్‌ముదిరాజ్, అంబటి రామకృష్ణ, పూజారి బాలరాజు, ఆంజనేయులు యాదవ్, గజ్జెల బాలకృష్ణ, పవన్, యాదగిరి, ఆర్జున్, షానవాజ్, మహబూ బ్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి : ఎమ్మెల్యే**

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో శక్తి వంచన లేకుండా కృషి చేయడం జరుగుతుందని బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జుబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ అన్నారు.శనివారం వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌లో రూ.27లక్షల వ్యయంతో సిసిరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ దేదిప్యవిజయ్‌కుమార్, మధురానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, కోడె సాంబశివరావు, హ నుమంతురావు, సుగుణ, సత్యసాయికుమార్, రాజేందర్ ప్రసాద్, సత్యనారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

-బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జసత్యం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జసత్యం, మల్లేష్, నందగోపాల్, వేముల రామకృష్ణ తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 10,ప్రభాతవార్త:**
కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిసి సంక్షేమసంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జసత్యం డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం కాచిగూడలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన ప్రక్రియ చేపట్టి బిసిలకు 42శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహు ల్‌గాంధీ చాలాసార్లు బిసిలకు సంబంధించిన డిమాండ్లపై మాట్లాడుతూ భారతదేశంలో కులగణన ద్వార మాత్రమే బిసిలకు న్యాయం జరుగుతుందని తెలిపారన్నారు. కులగ ణన చేసి ఆడేటా ఆధారంగా ఏవర్గానికి ఎంత వాటా అన్న దాన్ని లెక్కలోకి తీసుకుని ఆప్రకారమే రిజర్వేషన్లు పెంచా ల్సిన అవసరం కూడా ఉందని చాలా సార్లు చెప్పారని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీ దేశంలో కులగణన ,బిసి రిజర్వే షన్లపై పార్లమెంట్‌లో బిజెపితో కొట్లాడుతుంటే ఆయన స్ఫూ ర్తితో పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో మాత్రం బిసి రిజర్వేషన్లు కల్పించే విషయంలో స్పష్టత లేకపోవడం శోచనీయమన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని సిఎం ప్రకటించారని అయితే కులగణన చేపట్టకుండా ,స్థానిక సంస్థల రిజర్వేషన్లు పెంచ కుండా ఎన్నికలు నిర్వహిస్తే అడ్డుకుంటామన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న బిసి విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంటన స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, బిసి సంక్షేమ,గురుకుల హాస్టళ్లలో డైట్‌చార్జీలు పెంచాలన్నారు. బిసిఫ్రంట్ అధ్యక్షులు గొరిగె మల్లేష్ ,నందగోపాల్, బిసి విద్యార్థి సంఘం అధ్యక్షులు రామకృష్ణ, బిసి దళ్‌చైర్మన్ ఉద య్, బిసి జేఏసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి : బండి రమేష్

**మూసాపేట్, ఆగస్ట్ 10, ప్రభాతవార్త**
అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని నాణ్యత ప్రమాణాలను విధిగా పాటిం చాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అధికారులను హెచ్చరించారు. నియోజకవర్గ పరిధిలోని ఫతే నగర్ డివిజన్ ఇందిరా గాంధీపురం దగ్గర్లో రూ.60 లక్షల తో నూతనంగా నిర్మితమవుతున్న సిమెంట్ రోడ్డు పనులను ఆయన శనివారం పరిశీలించారు. డివిజన్ అధ్యక్షుడు స్థానిక నాయకులు ఈ రహదారి నిర్మాణంలో నాణ్యత లోపంతో జరుగుతుందని రమేష్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అక్కడి నుండే ఈఈ శ్రీనివాస్, డిఈ ఆనంద్, ఏఈ పవన్‌లతో ఫోన్‌లో మాట్లాడి రహదారి నిర్మాణ నాణ్యతపై ప్రశ్నించారు. దీనిపై క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ తమకు అందజేయాల్సిందిగా సూచించారు. బస్తీలోని మంచినీటి సమస్యపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధుగౌడ్ గృహప్రవేశానికి వెళ్లి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సాధు ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొని జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, నాగిరెడ్డి, రమేష్, వరహాలస్వామి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### సీతారామచంద్ర స్వామి కళ్యాణ మండపం ప్రారంభం



కళ్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న మేయర్ కోలన్ నీలాగోపాల్ రెడ్డి

**నిజాంపేట్, ఆగస్ట్ 10, ప్రభాతవార్త**
శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ సీతారా మచంద్ర స్వామి కళ్యాణ మండపాన్ని శనివారం మేయర్ కోలన్ నీలాగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి డిప్యూటీ మేయర్, నిజాంపేట్ అభయాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్ ప్రణయ ధనరాజ్ యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మేకల వెంకటేష్, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, చిట్ల దివాకర్, గాజుల సుజాత, కో ఆప్షన్ సభ్యులు తలారి వీరేష్ ముదిరాజ్, ఏనుగుల అభిషేక్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యు లు వైస్ చైర్మన్లు రాజమోహన్‌రెడ్డి, బైండ్ల నగేశ్, జాయింట్ సెక్రటరీ తలారి సాయి ముదిరాజ్, సీనియర్ నాయకులు ఆవుల జగన్ యాదవ్, వెంగయ్య చౌదరి, బొర్రా చందు ముదిరాజ్, తులసి అశోక్, గ్రామ లీడర్ వడ్ల నగేశ్‌చారి, కోలన్ కృష్ణారెడ్డి, కోలన్ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

### కెటిఆర్‌ను కలిసిన డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్

**నిజాంపేట్, ఆగస్ట్ 10, ప్రభాతవార్త**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ శనివారం తన పుట్టినరోజును పురస్కరిం చుకుని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను నంది నగర్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కెటిఆర్ ధనరాజ్ యాదవ్‌ని శాలువాతో సత్కరించి జన్మదిన శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యు లు, సీనియర్ నాయకులు, అభిమానులు, యువ నాయ కులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు లక్ష్మీఉప్పలమ్మ ఆలయంలో బోనాలు ఉత్సవాలు

**చిక్కడపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్ లోని జవహర్‌నగర్‌లోని లక్ష్మీ ఉప్పలమ్మ దేవాలయంలో బోనాలు ఉత్సవాలను ఆదివారం వైభవోపేతంగా నిర్వహిం చబోతున్నట్లు ఆలయం అధ్యక్ష, కోశాధికారి వై.సంజీవరెడ్డి, ఎం.ఎన్.ప్రవీణ్‌కుమార్ వివరించారు. పవిత్రమైన శ్రావణమాసంలో జరిగే ఈ బోనాలు ఉత్సవాలను పురస్క రించుకుని జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాజ్యస భ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎం.అనీల్ కుమార్ యాదవ్,ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ ఎంపి ఎం.అంజన్‌కుమార్ యాదవ్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం శంకర్ తదితరులు పాల్గొని పూజలు నిర్వహిస్తారన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

### నేడు 'మార్పు కోసం మంచి సినిమా' సదస్సు

**హైదరాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త**
భారత రాజ్యాంగానికి 75 ఏళ్ళ సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ సదర్న్ రీజియన్ ఆధ్వర్యంలో మార్పు కోసం మంచి సినిమా అనే అంశంపై ఆదివారం సద స్సు జరగనుంది.ఈ సదస్సు లక్డీకాపూల్, రెడ్‌హిల్స్, హరి నగర్‌లోని ప్రగతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్ పక్కన చాంప్స్ సి.ఎ. అకాడమిలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ సదస్సు జరుగుతుందని నిర్వ హకులు తెలిపారు.

## ఆక్రమ నిర్మాణం కూల్చివేత

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 10, ప్రభాతవార్త :** రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్‌పిఆర్‌హిల్స్ మహాత్మానగర్ బస్తీలో కొందరు ప్రభుత్వ స్థలంలో ఆక్రమించి నిర్మాణం చేపట్టడం తో రెవెన్యూ అధికారులు కూల్చివేశారు.మహాత్మానగర్ బస్తీ లో ప్రభుత్వ స్థలంలో ఓ వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా యదేచ్ఛగా అధికారుల కల్లు కప్పి నిర్మాణం చేపడు తుండటంతో స్థానికుల ఫిర్యాదు మేరకు ఖైరతాబాద్ మండల తహశీల్దార్ ఎమ్‌డి నయీముద్దీన్ అదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది అక్రమ నిర్మానాన్ని పూర్తిగా కూల్చివే శారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే ఎం తటి వారినైనా క్షమించేది లేదని వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు.

## అడ్వకేట్ సిద్దార్థ లూద్రాకు శుభాకాంక్షలు తెలిపిన పాపయ్య



సుప్రీంకోర్టు అడ్వాకేట్ సిద్దార్థ లూద్రాకు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు పాపయ్య.

**హైదరాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** ఎస్సీలలోని 59.కులాలకు సమానంగా రిజర్వేషన్లు పంపిణీ జరిగినప్పు డే మాదిగ, మాదిగ ఉప కులాలకు సమ న్యాయం జరుగు తుందని అడ్వాకేట్ సిద్దార్థ లూద్రా పేర్కొన్నారు. శనివారం తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టులో నియమించిన అడ్వాకేట్ సిద్దార్థ లూధరను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు, రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య పుష్పగుచ్చాలిచి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లూద్రా మాట్లాడుతూ గత 30.ఏళ్ల నుంచి ఎమ్మార్పీ ఎస్సీల ఏబీసీడి వర్గీకరణ చేయాలని పోరాడిం దని, అందుకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ తీర్పు వచ్చేందుకు అనేక సాక్ష్యాలను కోర్టు ముందు ఉంచి వాదనలు చేశామని, అంతిమంగా ధర్మానికి అనుకూలంగానే తీర్పు రావడం శుభపరిణామమన్నారు. అడ్వాకేట్ సిద్దార్థ లూద్రాకు తెలంగా ణ న్యాయవాదుల సంఘం నాయకులు కొమ్ము ప్రవీణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గెలువయ్య, ఎపి ఎమ్మార్పీఎస్ అధ్యక్షు లు డిఎస్.రాజు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్, యాదగిరి, దక్షిణ తెలం గాణ అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు ఘనంగా సన్మానిం చారు. ధర్మాసనంలోని 7.గురు న్యాయమూర్తులకు ప్రత్యేక ధన్యావాదాలు తెలుపుతున్నామన్నారు.

## మేడ్చల్-మల్కాజ్‌గిరి ఐఎన్‌టియుసి అధ్యక్షుడిగా భరత్‌గౌడ్

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 10 ప్రభాతవార్త**
కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాహుల్‌గాంధీని ప్రధానికి చేయటమే లక్ష్యంగా తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాముల ను చేయటమే లక్ష్యమని మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా ఐఎన్‌టి యుసి అధ్యక్షులు కూన భరత్‌గౌడ్ అన్నారు. శనివారం మేడ్చెల్ మల్కాజ్‌గిరిజిల్లా ఐఎన్‌టియుసి అధ్యక్షులుగా నియామకపత్రాన్ని ఐఎన్‌టియుసి జాతీయ ఉపాధ్యక్షులు సత్యజిత్‌రెడ్డిచేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకు న్నారు. ఈసందర్భంగా ఐఎన్‌టియుసి సీనియర్ నాయకులు కూన రవిందర్‌గౌడ్, శరత్‌గౌడ్‌లతోపాటు భారీఎత్తున ఐఎన్ టియుసి నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా కూన భరత్‌గౌడ్ మాట్లాడుతూ కార్మికులు, అసంఘటితరంగ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పాటుపడతానన్నారు. పరిశ్రమలలో కార్మిక సంఘాల అభ్యున్నతికి ఐఎన్‌టియుసి తప్ప మరే ఇతర ప్రత్యామ్నాయం లేదని రుజువు చేస్తానని హామీఇచ్చారు. ఐఎన్‌టియుసి రాష్ట్రనాయకులు ఐఎన్‌టియు సి ఓడిఎఫ్ యూనియన్ అధ్యక్షులు, అడిషనల్ జనరల్ సెక్రెటరీ లేబర్‌సెల్ టిపిసిసి కూన రవిందర్‌గౌడ్, ఆర్. ప్రకాశ్‌గౌడ్, జనరల్ సెక్రటరీ డి.చంద్రశేఖర్,

## వక్ఫ్ బోర్డుకు కమిషనర్‌ను నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్

**సైఫాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త:**
వక్ఫ బోర్డులోని దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కారించాలని, ముఖ్యంగా ఆస్తుల సంరక్షణ కోసం కమిషనర్‌ను నియమించాలని, జుడిషియల్ పవర్స్ ఇవ్వాల ని ఆల్ ఇండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కల మ్యానిఫెస్టోలో పేర్కొన్న అంశాలను అమలు చేయాల ని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింల స్మశాన వాటికలకు 125 ఎకరాల భూమిని కేటాయిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని ఆర్గనైజేషన్ ఆరోపించింది. శనివారం ఎస్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్గనైజేషన్ జాతీయ ఛైర్మన్ సయ్యద్ ముక్తార్ హుస్సేన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎం.ఎ.సిద్దిఖీ, ప్రతినిధు లు సనాఉల్లాఖాన్, ఎండి దస్తగిరి, సలీం తదితరులు మా ట్లాడుతూ 20 కిలోమీటర్ల దూరంలో హైవేలలో వంద ఎకరాల భూమిని స్మశాన వాటికలకు కేటాయించాలని కోరారు. పేద ముస్లింలు ఎవరైన చనిపోతే 20 వేల నుంచి 50 వేల వరకు చెల్లించి స్మశాన వాటికల్లో అంత్యక్రియలు చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కూడా స్మశాన వాటికిలకు స్థలాలు కేటాయించాలని, పేద ముస్లింలకు 100 గజాల చొప్పున వక్ఫ్ బోర్డు భూములను పంపిణీ చేయాలని, అక్ర మణకు గురైన వక్ఫ్ బోర్డు భూములను స్వాధీనం చేసు కోవాలని డిమాండ్ చేశారు.

## మండల్ కమిషన్ రిపోర్టు అమలులో పుంజాల శివశంకర్‌ది కీలకపాత్ర

- హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్లు తిరుమలి, సింహాద్రి తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 10,ప్రభాతవార్త:**
మండల్ కమిషనర్ రిపోర్టులను ఇంప్లిమెంటేషన్ చేయడం లో అప్పటి కేంద్రమంత్రిగా ఉన్న పుంజాల శివశంకర్ ఎంతోకీలకపాత్ర పోషించారని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఈమేరకు శనివారం శివశంకర్ 95వ జయంతి సందర్భంగా లక్డీకపూల్‌లోని మహాత్మాజ్యోతిభాపూలే టిబిసిఈఎఫ్ భవన్‌లో సతీష్ కొట్టే అధ్యక్షతన జయంతి సభను నిర్వహించారు. దీనికి జస్టిస్ చంద్రకుమార్‌తోపాటు ప్రొపెసర్ తిరుమలి, ప్రొఫెసర్ సింహాద్రి తదితరులు హాజ రై ఆయన చిత్రపటానికి నివాళ్లు అర్పించి ఆయనతో ఉన్న అనుబంధాన్ని ఆయన అందించిన సేవల్ని గుర్తుచేసుకు న్నారు. ఈసందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ ఇవాళ బిసిలకు ఉద్యోగాలల్లో రిజర్వేషన్లు ఉన్నాయనంటే అందు లో శివశంకర్‌పాత్ర చాలా కీలకమైందన్నారు. బిసి మండల్ ,పుంజాల శివశంకర్ బిసిలకు రెండు కళ్లలాంటి వారని కొనియాడారు. ప్రొఫెసర్ తిరుమలి మాట్లాడుతూ బిసిల రాజ్యాధికారం కోసం చాల లౌకికంగా వ్యూహాత్మకంగా బిసి ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలని తెలిపేవారన్నారు. ప్రొఫెసర్ సింహాద్రి మాట్లాడుతూ శివశంకర్ గొప్పచరిత్ర కారుడని ఎన్నో త్యాగాలు చేశారని కేవలం బిసి అయినం దునే ఆయన చరిత్ర ఎక్కడా లిఖించలేదన్నారు. వాస్తవా నికి ఆయన జీవితం పాఠ్యపుస్తకాల్లో ఉండాల్సిన మహో త్తన్నత విలువలు కలిగిన వ్యక్తి అన్నారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రిగా ఉండి న్యాయశాఖలో అనేక సవరణలు తెచ్చి న్యాయవ్యవస్థకు కూడా ఎంతో మేలు చేశారని పేర్కొ న్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు దుర్గం రవీందర్, దేవుళ్ల సమ్మయ్య, ప్రముఖ కళాకారుడు వరంగ ల్ శ్రీనివాస్, రంజిత్ ఆకుల, వినోద్, భద్రయ్య, విజయ్, శ్రావణ్, రవీందర్ బుద్ధి, పృథ్వీరాజ్, ప్రశాంత్, డి.వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌హెచ్‌సి కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి : నర్సింహ్మా



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.నర్సింహ్మా

**సైఫాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త:**
నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో గత మూడు సంవత్స రాలుగా ప్రైమరి హెల్త్ సెంటర్ స్థాయిలో ప్రజానీకానికి వైద్య సేవలు అందిస్తున్న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పి) లకు కనీస వేతనంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎఐటియుసి కార్యాలయంలో సమితి సభ్యుడు తోట రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ప్రొవైడర్స్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. కనీస వేతనం చట్ట ప్రకారం అందించ కుండా, అతి తక్కువ వేతనంతో వారు పనిచేస్తున్నారని, విధులను ఆనేక రకాలుగా వినియోగించుకుంటూ వారిపై పని భారం పెంచడం అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బిఎస్సీ విద్యార్హతతో డిస్టిక్ సెలక్షన్ కమిటీ ద్వారా వారిని ఎన్నిక చేసుకుని కనీస వేతనం 44 వేల రూపాయలు చెల్లించవలసి ఉండగా కేవలం 29 వేల రూపాయలు చెల్లించి ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. వారి సమస్యలు పరిష్కారానికి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నర్సింహ్మా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి యూనియన్ రాష్ట్ర అధ్యక్షు డు సందీప్, ప్రధాన కార్యదర్శి ఎండి అస్రియ, సోసఫ్, చంద్రకళ, నవీన్, పవన్‌వర్మ, ప్రవీణ్‌కుమార్, రాజుగౌడ్, ఈ.రాజ్‌కుమార్, అక్షయ్, సంధ్య, వి.లక్ష్మి, రేణుక, మహే శ్వరి, భారతి తదితరులు పాల్గొన్నారు.

## కళలే జాతికి కలిమి బలిమి : డా. పసుమర్తి శేషుబాబు



నాట్యగురువును సన్మానిస్తున్న శేషుబాబు, దైవజ్ఞశర్మ, లలితారావు తదితర అతిథులు

**రవీంద్రభారతి, ఆగస్టు 10 ప్రభాతవార్త :** కళలులేనినాడు కళలేదు జాతికి, కళలు కలిగిననాడే కలదు బలిమి, కలిమి నరుల కలకాలం విరుసుంబ అని ప్రముఖ కూచిపూడి యక్షగాన కంఠీరవ డా. పసుమర్తి శేషుబాబు అభివర్ణించా రు. గురువు వసుధ ద్విగుణీకృత రసభావంతో ఎన్నోమెట్టు అధిగమిస్తున్న ధీశాలి అని కొనియాడారు. ఆమె మనుధర్మాలను ధరిస్తూ, భరిస్తూ దేశంలోనే గుర్తింపబడిన కళాకారిణిగా ఎదిగారని, శిష్యుల కూచిపూడి నృత్యప్రదర్శ నల్లో శాస్త్రీయ నృత్యాలు షడ్రుచులు రసాలు, నాట్యకవ ళికలు, హావభావాలు కనిపించాయని వారు పేరుప్రఖ్యాతు లతో వర్ధిల్లాలని శుభాశీస్సులందజేశారు. సరస్వతీ ఉపా సకుడు దైవజ్ఞశర్మ నాట్యం సమాహార కళని, పంచ భూతాల్లో నాట్యానికి ప్రముఖస్థానముందని, వసుధ ఒక గొప్ప నాట్యకళాకారిణిగా, కళాసంస్థను నెలకొల్పి గురు వుగా ఎంతోమంది శిష్యులను మంచి కూచిపూడి కళాకారు లుగా తీర్చిదిద్దడం హర్షదాయకమని, ఆమెను, శిష్యులను ఆశీర్వదించారు. ప్రముఖ కళాసంస్థ కూచిపూడి కళాక్షేత్రం ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో శనివారం ఉదయం సంస్థ రెండవ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని ప్రఖ్యాత నాట్యగురువు, సంస్థ వ్యవ స్థాపకురాలు మాగంటి వసుధ నేతృత్వం జరిగిన సంస్థ రెండవ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. పసుమర్తి శేషుబాబు, విశిష్ట అతిథులు దైవజ్ఞశర్మ, నాట్యగురువు ఇందుమతి, భారత్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థా పక అధ్యక్షురాలు లయన్ లలితారావు తదితరులతో కలిసి కూచిపూడి నృత్యప్రదర్శనలు కావించిన చిన్నారి కళాకారు లకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందించి, గురువు ఎం.వసుధను ఘనంగా సన్మానించి ఎంతగానో అభినం దించి ఆమె కళాసేవను కొనియాడారు.

### అభ్యుదయకవి ఆచార్య ఎస్వీ గ్రంథాల ఆవిష్కరణ

**నాంపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త :** తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళా మందిరంలో ప్రముఖ అభ్యుదయకవి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవి ద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ గ్రంథాల ఆవిష్కరణ, సప్తతి ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం, ఎస్వీ హితులు శిష్యులు మీడియా తెలిపారు. ఈ నెల 16 శుక్రవారం సా యంత్రం 5గంటల నుండి తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు, తెలుగు విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య అలేఖ్య పుంజాల సభాధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, పురావస్తుశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని విశిష్ట అతిథులు తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి డా. బుర్రా వెంకటేశం, తెలంగాణ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ జింబో, పాత్రికేయులు గుడిపాటి, బైస దేవదాసు, శ్రీధర్ తదితరులతో కలిసి అభ్యుదయ కవి ఎస్వీ సత్యనారాయణ సప్తతి ఉత్సవంలో పాల్గొని ఆయన రచించిన గ్రంథాలను ఆవిష్కరిస్తారని వారు వివరించారు.

### నేడు సగర సంఘంలో ఉచిత దంత వైద్య శిబిరం

**మూసాపేట్, ఆగస్ట్ 10, ప్రభాతవార్త :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్‌కాలనీ సమీపంలో గల షిరిడి హిల్స్ సగర సంఘం కార్యాలయం ఆవరణలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం దంత సమ స్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సాగర సంఘం అధ్యక్షు లు ఏ.కొడయ్య సాగర్, ప్రధాన కార్యదర్శి ఆస్కానీ శ్రీనివాస్ సాగర్‌లు తెలి యజేశారు. ఆల్విన్ కాలనీలో గల ఎస్‌పిఎస్ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో ఆది వారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత దంత వైద్య శిబిరంతోపాటు దంత సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## మంత్రగాళ్ళు, బాబాలపై చర్యలు తీసుకోవాలి

**సైఫాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త:**
రాష్ట్రంలో అమాయక ప్రజలను బాణామ తి, చేతబడి, దెయ్యాలు, భూతాలు, సైతాన్ పేర్లతో దోపిడీ చేస్తున్న మంత్ర గాళ్ళు, బాబాలు, భూత వైద్యులను ని యంత్రించడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞాన దర్శిని అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో వలే రాష్ట్ర ప్రభుత్వం నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. కొంతమంది బా బాలు ఆధ్యాత్మికతను అసరాగా తీసుకుని ప్రజలను ఆర్థికంగా, లైంగికంగా దోపిడీ చేస్తున్నారని, వారిపైన చట్టపరంగా చర్య లు తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభు త్వాన్ని, డిజిపిని కోరారు.

IN THE COURT OF HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT. AT L.B.NAGAR
O.S. No. 330 OF 2024

Between:
1. Avvaru Rama Devi W/o Late Avvaru Prakasa Rao, S/o Late Avvaru Mallaiah, Aged about 73 years, Occ; House wife, R/o, Plot No. 41, RTC Colony, Karmanghat, Chintalakunta, Check Post, Chintalakunta, L. B. Nagar, Ranga Reddy District, Telangana. Pin Code 500074.
2. Avvaru Satya Kiran S/o Late Avvaru Prakasa Rao, Aged about 45 years, Occ; Business, R/o, Plot No. 41 RTC Colony, Karmanghat, Chintala kunta, Check Post, Chintal akunta, L.B.Nagar, Ranga Reddy District, Telangana. Pin Code 500074.
3. S. Hima Bindu D/o Late Avvaru Prakasa Rao, W/o S, Vishnuvardhan, Aged about 47 years, Occ; House Wife, R/o, H. No. 21/A, 7-1-396/ 2/10/1, Sree Venkat Residency, B. K. Guda, S.R. Nagar BalkamPet Yelamma Temple, Hyderabad District, Telangana. Pin Code 500038.
...Plaintiffs

AND

1. The Tahsildar, MRO Office, Balapur Mandal Ranga Reddy District.
2. All Concerned. .... Defendants

Whereas the above named plaintiffs are filed the above case to declare the plaintiffs are the successors and only legal heirs of deceased late Sri, Late Avvaru Prakasa Rao, S/o Late Avvaru Mallaiah, and the above matter is posted on 023-08-2024 for appearance of any persons for objections. The Hon'ble court was pleased to direct to take out notice through paper publication. Hence, take notice as the case is posted on 23-08-2024 at 10.30 A.M, Kindly appear in persons or through your counsel on the said case date..

SUIT SCHEDULE PROPERTY- A:All that piece and parcel of land bearing Plot No. 41, admeasuring 266.6 sqYards or (222.98) sq. Mtrs, forming part of in survey No.57, situated at in village.karmanghat of (Previously Saroornagar Rev, Mandal), Ranga Reddy District. At L. BNagar, is within the jurisdiction of this Hon'ble Court, and bounded by: Boundaries for entire land: East: plot No.42; West: Plot No. 40; South: 30' Wide Road; North: plot No 34;

// BY ORDER OF THE COURT//
Sd/-DURGAPURAM VIJENDER,
Advocate,
H.No: 8-1-15/27, Padma nagar,karmanghat, saroornagar,Hyderbad-500079, TS.
PH.No. 9581065399

IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, AT : HYDERABAD
O.S.NO. 3309 OF 2024

Between :
Ranjana A G Akklkotker
...Plaintiff

AND

The Tahsildar Himyathnagar Mandal & another...
...Defendants

To,
All Concerned (Defendant No.2)

Whereas the above named Plaintiff filed above suit seeking relief of Declaration, Declaring, the Plaintiff status as legal heir/successors of Late A.G.Akkal Kottker S/o. Govind Rao who died on 10.03.1987.

Hence if any person/s or institution/s have any kind of objection whatsoever, may hereby summoned to appear in above court in person or by a Pleader duly instrucated and able to answer all material questions relating to the suit or who shall, be accompanied by some person able to answer all such questions on the 16th Day of October, 2024 at 10.30 A.M. in the forenoon to answer the claim and further you are hereby directed to file within 30 days of notice of this Summon a written statement of your Defence and to produce on the said day all documents in your possession or power upon which you base your Defence. Take Notice that in dafault of appearance and to file written statement of any interested parties within thirty days the suit will be heard and determined in absence.

By the order of the court
B. Sheshu Kumar
Advocate
O/o 3-3-991/1, Kutbiguda, Hyderabad
Ph.No. 9000011282
Counsel For the Plaintiff

**PUBLIC NOTICE**

The General Public is here- by informed that my Client Ms. BUDAMAGUNTA PRAGNYA, D/o. BUDAMAGUNTA HARI KRISHNA, Aged about 23 years, Occ - Student, R/o. H.no. 10-2-59, Ramalayam street, Fathe nagar, Medchal- Malkajgiri District, Telangana had lost the Original Registered Sale Deed. Vide Document No: 573/1971, and Document No:1629/1985 registered in the office of SRO, Ranga Reddy Dist Pertaining to House Bearing No. 10-2-10. Extent 100 Sq Yards and equivalent to 83.6 Sq meters, in, situated at Fathe Nagar Village , Balanagar Mandal, Medchal-Malkajgiri District, while travelling from her residence to Sanathnagar on her Two Wheeler. My client has made several efforts to trace the said documents but could not found. If any person finds the said documents above mentioned may please return to my Client. Persons returning the Original Documents shall be duly rewarded. Hence this Public Notice.

M PREM KUMAR
Advocate
3rd floor, Abullah khan building, Madhura Nagar, Hyderabad
Mob:9700013145

# పంచాయతీ కార్యదర్శి దేవేందర్‌గౌడ్‌కు సంజాయిషీ నోటీసు

(వార్త ప్రభావం)

**హత్నూర ఆగస్టు 10,ప్రభాతవార్త:** వార్త దినపత్రికలో వచ్చిన కథనంకు అధికారులు స్పందించారు. ఈనెల5న, అభ్యంతరాలు పట్టించుకొని పంచాయతీ కార్యదర్శి అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.చందాపూర్ ఇంచార్చి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన దేవేందర్‌గౌడ్‌కు ఎన్ఓసి ఇచ్చిన విషయంలో వివరణ ఇవ్వాలని నోటీస్ జారీచేసినట్లు హత్నూర ఎంపిడిఓ శంకర్ తెలిపారు.పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన వివరణ ఇచ్చాడని,దీని ప్రతులను,తదుపరి చర్యల నిమిత్తం సంగారెడ్డి జడ్పీసిఇఒకు నివేదిక సమర్పించామని అన్నారు.జిల్లా పంచాయతీ అధికారికి కూడ నివేదిక పంపనున్నట్లు ఎంపిడిఓ తెలిపారు.

## దేవస్థానంకు ధర్మకర్తల కమిటీ ఏర్పాటుకు ఆహ్వానం

**షాబాద్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థా నం ధర్మకర్తల కమిటీ ఏర్పాటుకు దేవాదాయ శాఖ దరఖాస్తులు స్వీక రిస్తున్నట్లు ఎండోమెంట్ అధికారి శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలో ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంకు ఈనెల 31వ తేదిలోపు ఆసక్తి కలిగిన వారు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో తమ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9396451009ను సంప్రదించాలని తెలిపారు.

## బస్సు పాసులను అందించిన మున్సిపల్ వైస్ చైర్మన్

**ఆదిభట్ల ఆగస్టు10,ప్రభాతవార్త :** ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళపల్లి పటేల్ గూడలో ఆదిభట్ల మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కామన్ల యాదగిరి వికలాంగులకు బస్సు పాసులను అందించారు.దాదాపు 100మంది వికలాంగులకు బస్ పాసులను అందించినట్లు ఆయన తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ...వికలాంగులకు బస్సు ప్రయాణం ఎంతో విలువైందని వారికి బస్సు పాసులు అందజేయడం సంతోషంగా ఉందని అన్నారు.

## రిజర్వేషన్ల సమాన పంపిణీతోనే ఉపకులాలకు న్యాయం

**సిద్ధిపేట రూరల్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన న్యాయవాది సిద్దార్థ లూద్రాను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు, జాతీయ నాయకులు,రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య ఆధ్వర్యంలో శనివారం కలిసినట్లు పోరాట సమితి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు న్యాయవాది సిద్దార్థ లూద్రాను శాలువాలతో ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. ఎస్సీలలోని 59 కులాలకు సమానంగా రిజర్వేషన్లు పంపిణీ జరగాలని అప్పుడే మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందని సుప్రీం కోర్టు న్యాయవాది తెలిపినట్లు తెలిపారు. 30 యేండ్లుగా చేసిన పోరాట ఫలితం ఫలిస్తుందన్నారు. కార్యక్రమంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్, తెలంగాణ న్యాయవాదుల సంఘం నాయకులు కొమ్ము ప్రవీణ్‌కుమార్,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులిజాల గెలువయ్య, కేదాసి మోహన్, యాదగిరి, మల్లె పోగు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ కోతల ప్రభుత్వం

**-ప్రజలకు ఏ కష్టం వచ్చిన ఎల్లప్పుడు అందుబాటులో ఉంటా**

**-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు**



సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎగవేత..కోతల ప్రభుత్వంగా మారందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం 217 మంది లబ్ధిదారులకు రూ.49 లక్షల 91 వేల సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అబద్దాలు..మోసం మాటలతో అ ధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేయడమే పనిగా పెట్టుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు చెవుటోని ముందు శంఖం ఉదినట్లుగా ఉందన్నారు.కాంగ్రెస్ పాలనలో ఎరువులకు సైతం రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లిద్దామంటే డబ్బులు లేవన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలలో పని చేసే కార్మికులకు 8 నెలల నుంచి వేతనాలు దిక్కులేవన్నారు. పెన్షన్లు, రైతుబంధు,కళ్యాణ లక్ష్మీ లక్షరూపాయాలతో పాటు తులం బంగారం హామీ అడ్రస్ లేదన్నారు. 4 వేల పెన్షన్‌కు దిక్కులేదు కెసిఅర్ ఇచ్చిన పెన్షన్ రాక రెండు నెలల నుంచి వృద్దులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కళ్యాణ లక్ష్మీ చెక్కులు రాక 8 నెలల రావడం లేదన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో దోమలు, ఈగలు వృద్ది చెంది ప్రజలు డెంగ్యూ తదితర వ్యాధుల బారిన పడు తున్నారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చిన ఎల్లప్పుడు అందు బాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనక రాజు, పార్టీ శ్రేణులు గుండు భూపేష్, సాయిరాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రైతులు పాడి పశువుల పెంపకంపై దృష్టి పెట్టాలి

**-మారుతున్న కాలానికి అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలి**

**-రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**అక్కన్నపేట,ఆగస్టు 10,ప్రభాతవార్త**

రైతులు పాడి పశువుల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.శనివారం అక్కన్నపేట మండలంలోని రామవరం,మల్లంపల్లి గ్రామాలలోని రైతు వేదికల్లో వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలపై అధికారులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించగా ఈ కార్యక్రమానికి మంత్రి ముక్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా వాణిజ్య పంటలు సాగు చేస్తూ అధిక లాభాలు వచ్చే పంటలను సాగుచేసుకోవాలని సూచించారు.దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతులకు రుణమాఫీ చేస్తున్నామని అందులో భాగంగా ఇప్పటికే ఒక లక్ష 50వేల లోపు రుణాలు అన్ని మాఫీ చేశామని,వచ్చే వారం రోజుల్లో 2లక్షల వరకు ఉన్న రుణాలు చేసం మాఫీ చేస్తున్నట్లు ప్రకటించారు.గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రభుత్వం 431.50 కోట్లు మంజూరు చేసిందని త్వరలోనే ప్రాజెక్టు పనులు పూర్తి చేసి నియోజకవర్గంలో ఒక లక్ష 6వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీవో రాంమూర్తి,తహశీల్దార్ అనంతరెడ్డి,మండల ప్రజాపరిషత్ అధికారి జయరాంనాయక్,ఏపిఎం శ్రీనివాస్,ఏవో నాగరాజు,సిడిపివో జయ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య,సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, బుర్ర ప్రభాకర్‌గౌడ్,నాయకులు ముత్యాల సంజీవరెడ్డి, రమేష్, మోహన్ కుమార్,పాండ్రాల దాము,సీను,రాకేష్, నవీన్,నవీన్,ఉపేందర్,తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వారిని దర్శించుకున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



స్వామి వారిని దర్శించుకుంటున్న అడిషలన్ జిల్లా కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**కొమురవెల్లి, ఆగస్టు 10, ప్రభాతవార్త :**

సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామిని శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో బాలాజీ,ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్,పర్యవేక్షకులు సురేందర్ అడిషనల్ కలెక్టర్‌కు స్వామి వారి శేషవస్త్రం,ప్రసాదం అందించారు.

## ప్లాస్టిక్ రహిత భారత్ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలి

**-ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషన్ చైర్మన్ వెంకటయ్య**




విలేజ్ బ్యాగ్‌ను ప్రారంభిస్తున్న ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

**మిరుదొడ్డి, ఆగస్టు 10, ప్రభాతవార్త :**

ప్లాస్టిక్ రహిత భారత్ నిర్మాణంలో ఎర్త్ ఫౌండేషన్ చేపట్టిన విజేల్ బ్యాగ్ ఒక గొప్ప ముందడుగని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. భూంపల్లి-అక్బర్‌పేట మండల పరషత్ ప్రాథమిక పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ శనివారం చేపట్టిన ప్లాస్టిక్ రహిత భారత్ నిర్మాణంలో ఆయన పాల్గొని విలేజ్ బ్యాగ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎర్త్ ఫౌండేషన్ విద్యతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు గొప్ప కార్యక్రమాన్ని భూంపల్లిలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టర్ అధికారి భాస్కర్,మండల నోడల్ అధికారి అంజగౌడ్,పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, వివో మహిపాల్,అమ్మ అదర్శ కమిటీ చైర్మెన్ గౌతమి, ఎర్త్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ అంజనేయలు,రాజు,నీహారిక, ప్రశాంత్, ఇమ్రాన్, విద్య వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## చాకరిమెట్ల అంజన్నకు ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

**శివ్వంపేట, ఆగస్టు10 ప్రభాతవార్త:**

మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శివ్వంపేట మండలంలోని చిన్నగొట్టిముక్కుల గ్రామ శివారులో గల చాకరిమెట్ల సహకార ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ శనివారం పురస్కరించుకొని ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ మాట్లాడుతూ శ్రావణ మాసం పురస్కరించుకొని ఆంజనేయ స్వామి విశేష పూజలు జరుగుతున్నాయని, ఈ శ్రావణమాసంలో ఆంజనేయ స్వామిని దర్శించుకున్న వారికి కోరిన కోరికలు తీరుతాయని ఆయన అన్నారు. శ్రావణ మాసం మొదటి శనివారం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు కొడకంచి సత్యాగౌడ్ జ్ఞాపకార్థం సత్యాగౌడ్ కుమారుడు కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, కొడకంచి రవీందర్‌గౌడ్, కొడకంచి నర్సింలుగౌడ్లఉ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దేవదత్తు శర్మ, ప్రభురాజ శర్మ, శ్రీవాస్తవ శర్మ, ఆలయ సిబ్బంది రామకృష్ణ, శ్రీణివాస్, ప్రకాష్, భక్తులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ బాధితునికి అప్పగింత

**మర్కుక్, ఆగస్టు 10 (ప్రభాతవార్త):**

మర్కుక్ మండలం చిన్నకిష్టాపూర్ గ్రామానికి చెందిన జైపాల్‌రెడ్డి తన మొబైల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా మర్కుక్ పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు ఇచ్చాడు. పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌ను ఐఎంఈఐ నెంబర్‌ను ఎంటర్ చేసి బ్లాక్ చేసి కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్‌ను స్వాధీనం చేసుకొని బాధితునికి అప్పగించినట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు.

# పుణ్యక్షేత్రం ఏడుపాయల్లో దొంగల బీభత్సం

**-హుండీలను ఎత్తుకెళ్లి సొత్తు చోరీ**

**-సెక్యూరిటీ, సిసి కెమెరాలున్నా పనితనం సున్నా**



ఆలయ హుండీని దోచుకుని ఆలయం బయట పారేసిన దుండగులు

**పాపన్నపేట, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

భక్తులు తమ మొక్కుబడిలో భాగంగా అమ్మవారికి హుండీలో సమర్పించున్న నగదును గుర్తు తెలియని దొంగలు తస్కరించుకుపోయారు. పవిత్ర పుణ్య క్షేత్రమైన ఏడుపాలయ వనదుర్గా భవాని మాత ఆలయంలో శుక్రవారం రాత్రికి ఇరువురు దొంగలు మండపంలోకి ప్రవేశించి 2 హుండీలను తీసుకెళ్లి ఆలయ ఆవరణలోని పాత కళ్యాణ కట్ట, మరుగుదొడ్డి సమీపంలో హుండీలను ధ్వంసం చేసి నగదు, ఆభరణాలను అపహరించుకుపోయారు. ఆలయ మండపంలో 7 హుండీలు ఉండగా మరో రెండు హుండీలు ఆలయ గర్భగుడిలో ఉన్నాయి. నిత్యం మాదిరిగానే ఆలయ అర్చకులు రాత్రికి ఆలయాన్ని మూసి వెళ్లారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఇరువురు దొంగలు (సిసి కెమెరాల్లో రికార్డు) మండపం గ్రిల్ తాళం తీయకుండా గ్రిల్‌ను తొలగించి మండపంలోకి ప్రవేశించి 2 హుండీలను తీసుకెళ్లి నగదును తస్కరించుకుపోయారు. ఆలయ హుండీలను జులై 30న లెక్కించడంతో హుండీలో కేవలం 10 రోజులు భక్తులు సమర్పించిన నగదు, ఆభరణాలే ఉంటాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తన సిబ్బందితో ఆలయానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి సిసి పుటేజిలను పరిశీలించగా ఇరువురు గుర్తు తెలియని దొంగలు ముసుగులు ధరించి చోరీలకు పాల్పడ్డట్లు తెలుస్తోంది. త్వరలోనే దుండగులను పట్టుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.

**-సిసి కెమెరాలు, సెక్యూరిటీ ఉన్నా పనితనం సున్నా...**

భక్తుల కోరికలు తీరుస్తున్న ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయానికి భద్రత కరువైందని చెప్పడం అతిశయోక్తి కాదు. ఏడాడికి కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుస్తున్న ఏడుపాలయ వనదుర్గా భవాని మాత ఆలయానికి సరైన భద్రత లేక తరుచూ దొంగతనాలు చోటు చేసుకుంటున్నా నివారణ చర్యలు కరువైనాయి. గతంలో దుండగులు ఆలయ గర్భాలయంలోకి చొరబడి హుండీని ధ్వంసంచేసి ఆభరణాలతో పాటు నగదును దచుకెళ్లిన విషయం పాఠకులకు విధితమే. అప్పట్లో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి దొంగలను 24 గంటల్లోనే పట్టుకుని చోరీ సొత్తును రికవరీ చేశారు.

**-చోరీ జరిగినా పత్తాలేని ఆలయ ఈఓ...**

ఆలయంలో శుక్రవారం రాత్రికి చోరి జరిగినా ఆలయ ఈఓ ఇంచార్జిడిసీ కావడంతో అదనపు బాధ్యతల సాకుతో ఆలయానికి రాలేకపోయారు. అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నా దొంగతనం చోటు చేసుకుంటే ఈఓ ఆలయానికి రాకపోవడం ఏమిటని భక్తులు మండిపడుతున్నారు. ఆలయ ఈఓకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆలయ సిబ్బంది సైతం తమ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని, ఆలయ అభివృద్ధి కుంటు పడుతోందని భక్తులు మండిపడుతున్నారు. ఏదేమైనా ఆలయంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని భక్తులు సూచిస్తున్నారు.

## నులి పురుగుల నివారణతో ఆరోగ్యం : మున్సిపల్ చైర్మన్



విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను వేస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

**అమీన్‌పూర్, ఆగస్టు10 ప్రభాతవార్త:**

చిన్నపిల్లల నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరూ నులి పురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని, ఆరోగ్యంగా ఉండాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. జాతీయ ఫైలేరియా, నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని మహిమా మినిస్ట్రీస్ అనాధ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధకాల వ్యాధిని నిరోధించేందుకు పాఠశాల స్థాయి నుండే మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, చేతుల శుభ్రత పాటిస్తే నులి పురుగులు వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ, కోఆప్షన్ సభ్యులు తలారి రాములు, సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

**-ఇద్దరి పరిస్థితి విషమం..**

**టేక్మాల్,ఆగస్టు 10, ప్రభాతవార్త:**

161 జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలై ఇద్దరికి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే ఈ విధంగా ఉన్నాయి. 161 జాతీయ రహదారి ఇరు పక్కలో నాటిన మొక్కలకు నీళ్లు పట్టేందుకు నిలిపి ఉన్న నీళ్ల ట్యాంకర్‌ను జోగిపేట వైపు నుండి అతివేగంగా వస్తున్న ఆటో వచ్చి ట్యాంకర్ వెనుక భాగంలో ట్యాంకర్‌తో నీళ్లు పడుతున్న శ్రీనివాస్ అనే వ్యక్తిని డీకొని ట్యాంకర్ కిందకు ఆటో దూసుకెళ్లింది. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని జెసిబి సహాయంతో గాయపడిన ఇద్దరిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. ట్యాంకర్ నీళ్లు పడుతున్న వ్యక్తి శ్రీనివాస్ పెద్ద శంకరంపేట మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తిం చారు. ఆటోల ఉన్న వ్యక్తి రాజు వట్‌పల్లి మండలం పోతులబొగుడ గ్రామానికి చెందిన వ్యక్తి అని గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది.

## గంజాయి పెంచిన రాథోడ్ తుకారామ్‌కు రిమాండ్

**-పత్తి పంటలో అంతర్‌పంటగా గంజాయి సాగు**

**సిర్గాపూర్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** పత్తి పంటలో ఆంతర్ పంటగా గంజాయిని సాగు చేస్తున్న రాథోడ్ తుకారం (30)ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వాసర్ గ్రామ శివారులో చందర్ నాయక్ తండాకు చెందిన రాథోడ్ తుకారాం తను సాగు చేసుకుంటున్న పత్తి పంటలో అంతర్‌పంటగా గంజాయి మొక్కలను సాగు చేసుకుంటున్నాడన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో ఎస్ఐ వ్యవసాయ పొలాన్ని పరిశీలించగా 30 గంజాయి మొక్కలను గుర్తించామన్నారు. గంజాయి మొక్కలను సీజ్ చేసి తుకారంను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయి సాగు చేస్తున్న వ్యవసాయ భూమిపై, బాధిత రైతుకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలైన రైతు బంధు, పంట రుణాలు ఇవ్వకపోవడం, రుణాలను మాఫీ చేయడం ఆపేస్తారన్నారు. గంజాయి మొక్కలు పెంచితే కఠిన చర్యలు తప్పవని, అందుకు గంజాయిని పెంచుకుంటున్న రైతులు వెంటనే స్వచ్ఛదంగా మొక్కలను ధ్వంసం చేసుకోవాలని ఎస్ఐ హితువు పలికారు.

# చందాపూర్‌లో కుంట మాయం

**-తనిఖీలో అవాక్కైన అధికారులు**



రోడ్డుగా మారిన కుంటను పరిశీలిస్తున్న రెవెన్యూ,ఇరిగేషన్ అధికారులు

**హత్నూర ఆగస్టు 10,ప్రభాతవార్త:**

ఇరిగేషన్‌శాఖ పరిధిలోని కుంటలు,నామరూపాలులేకుండా పోతున్నా సంబందిత శాఖ అధికారుల్లో చలనంలేకుండా పోతుంది..ఉన్నాతాదికారులు అదేశిస్తేతప్ప తమపరిధిలోని కుంటల పరిస్థితిఏంటో తెలియని పరిస్థితి నెలకొంది హత్నూర. మండలంలోని చందాపూర్,చింతల్‌చెరువు గ్రామాలలో కుంటలు నామరుపాలు లేకుండా పోవడంతో నివ్వేరపోవడం అధికారుల వంతైంది.జిల్లా ఉన్నాతాదికారుల అదేశాలతో చందాపూర్,చింతల్‌చెరువు గ్రామాలలో ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు మండల సర్వేయర్ శ్రీనివాస్,ఇరిగేషన్ డిఇ రవికుమార్,ఎఇ భూపుత్రలు సంయుక్తంగా కుంటలను పరిశీలించారు.రికార్డుల ప్రకారం పరిశీలించిన అధికారులకు కుంటల జాడనే కనిపించలేదు. కుంటల కట్టలను చెరిపేసి రోడ్డుగా మార్చడంతో అధికార్దుల అవాక్కుకావలసి వచ్చింది.ప్రభుత్వ రికార్డుల ప్రకారం చందాపూర్ గ్రామంలో పాతబావి నల్లకుండా ఉంది.దాని సర్వేనెంబర్ 90 పరిధిలో 9ఎకరాల9గుంటల భూమీ ఉంది. అధికారుల పర్యటనలో సంబందిత కుంట నామరుపాలు లేకుండా పోయింది. కుంటకట్ట స్థానంలో రోడ్డు ఏర్పాటైంది. కట్టను,తూమును తొలిగించి రోడ్డు ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు. చింతల్ చెరువు గ్రామం పరిదిలోని నడప్పగారి కుంట కూడ నామరుపాలు లేకుండా పోయింది.దీని పరిధిలో 19ఉకరాల 8గుంటల భూమీ ఉంది.ఇక్కడ కూడ కుంటకట్టను తొలిగించినట్లు అధికారులు గుర్తించారు.ఈవిషయమై ఇరిగేషన్ డిఇ వికుమార్‌ను వివరణ కోరగా చందపూర్ గ్రామం పరిధిలోని పాతబావి నల్లకుంట,చింతల్ చెరువులోని నడప్పగారి కుంటలు నిభంధనలకు విరుద్దంగా తొలిగించారని అన్నారు.కుంట పరిధిలోని భూమీ పట్టాభూమీ అయిన ప్రభుత్వ కుంటకట్టలను తొలిగించే అధికారంలేదని అన్నారు.నీటి నిల్వకు అవసరమైన కట్టలను, తొలిగించడం చట్టవిరుద్దమని అన్నారు.జియోట్యాగ్ చేసి,అనంతరం కుంటలను యతస్థితిలోకి తెచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

**భాద్యులపై క్రిమినల్ కెసునమోదు చేయాలి**

**: మాజీ ఎంపిటిసి రాజేందర్ డిమాండ్**

చందాపూర్‌లోని పాతబావి నల్లకుంట కట్టను చట్టవిరుద్దంగా తొలిగించిన వారిపై క్రిమినల్ కెసులు నమోదు చేసి,శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక మాజీ ఎంపిటిసి,మండల ఎంపిటిసిల ఫోరం మాజీ అధ్యక్షులు టి.రాజేందర్ డిమాండ్ చేశారు.కట్టను యదాస్థితిలోకి వచ్చేల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# భక్తులతో సందడిగా మారిన నాచగిరి



స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

**వర్గల్, ఆగస్టు 10 (ప్రభాతవార్త):**

వర్గల్ మండలం నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ్మస్వామి క్షేత్రం శ్రావణమాసం మొదటి శనివారం కావడంతో భక్తులతో సందడిగా మారింది. ఆలయానికి వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఆలయంలో స్వామివారి నిత్య కళ్యాణాలు 4, నిజాభిషేకాలు 10, శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు 30 మంది జంటలు ఆచరించడం జరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ పేర్కొన్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## రాజీవ్‌రహదారిపై గొర్రెలను ఢీకొట్టిన కంటైనర్

**-15 గొర్రెలు మృతి, 20 గొర్రెలకు తీవ్ర గాయాలు**



మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న పోలీసులు

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 10 (ప్రభాతవార్త):**

గజ్వేల్ మండలం కొడకండ్ల రాజీవ్‌రహదారిపై మేతకు వెళ్తున్న గొర్రెల పైకి కంటైనర్ లారీ దూసుకెళ్ళడంతో 15 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందగా 20 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. కొడకండ్ల గ్రామానికి చెందిన కోరె మల్లయ్య, బీడ భూమయ్యలకు చెందిన గొర్రెలను మేత కోసం రాజీవ్‌రహదారి దాటిస్తుండగా నాగపూర్ నుంచి హైద్రాబాద్‌కు సిమెంట్ లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి గొర్రెలపైకి దూసుకెళ్ళింది. 15 గొర్రెలు మృతిచెందగా 20 గొర్రెలు తీవ్ర గాయాలు కావడంతో సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు గొర్రెల యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న కుకునూర్‌పల్లి ఎస్ఐ బి.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.